17వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
శనివారం | 20 జులై 2024 | పేజీలు 9

## వేడుకగా కపిలేశ్వరుడి పవిత్ర సమర్పణ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం వేడుకగా గ్రంథి పవిత్ర సమర్పణ జరిగింది. ఈ మేరకు ఉదయం 8 నుండి 11 గంటల వరకు యాగశాల పూజ, హెూమం, లఘు పూర్ణాహుతి, గ్రంథి పవిత్ర సమర్పణ చేపట్టారు. సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు యాగశాలపూజ, హెూమం, పట్టు పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ కృష్ణ వర్మ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.





## జిల్లాలో నామినేటెడ్ పదవుల కోలాహలం

కూటమినేతల మధ్య పోటాపోటీ

ఆశావహుల జోరు

జిల్లాలో నామినేటెడ్ పదవుల కోసం నేతల మధ్య పోటాపోటీ నెలకొంది. ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేసిన నేతలతో పాటు, ఐదేళ్లపాటు పార్టీ జెండా మోసిన కార్యకర్తలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. త్వరలో ప్రధాన పదవులను భర్తీ చేసే అవకాశం ఉండడంతో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతల మధ్య ఆశలు చిగురిస్తున్నాయి.



వివరాలు 2లో

## రెస్కోలో తవ్వేకొద్దీ అవినీతి..?

గత ప్రభుత్వ హయంలో అవినీతికి ఆజ్యం

ఉద్యోగ నియామకాలు, పదోన్నతులలో నిబంధనలకు నీళ్లు

విచారణకు ఆదేశించిన ప్రస్తుత ప్రభుత్వం

ముమ్మరంగా సాగుతున్న విచారణ

120 మంది ఉద్యోగుల తొలగింపు

నూతనంగా రెస్కో ఎం.డీ నియామకం

రెస్కో భవిష్యత్ ముఖ్యమంత్రి చేతుల్లోనే..!

వెనకబడిన కుప్పం నియోజకవర్గంలో వెలుగులు నింపేందుకు 1983లో ఏర్పాటైన కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో) 2019 వరకు సజావుగానే సాగింది. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఒక్కసారిగా అవినీతి కూపంలోకి కూరుకుపోయింది. ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో 2019 నుంచి 2024 జూన్ వరకు వ్యవహరించిన పాలకవర్గం, ఉన్నత అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో 40 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలందించిన రెస్కో సంస్థకు మరకలు అంటుకోవడంతో పాటు ఉనికి ప్రశ్నార్ధకంగా మారే పరిస్థితి దాపురించింది.





వివరాలు 2లో

## టీడీపీ కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్

✳ నాపై నింద ఆరోపణ రాజకీయాలు చెవిరెడ్డికి తగదు

✳ నమ్మిన వారిని మోసం చేయడం నీ వంతు

✳ కార్యకర్తలకు అండగా నిలిచి ప్రేమించడం నా వంతు

✳ చెవిరెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

✳ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నాని

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** నీచ రాజకీయాలు చేసి కార్యకర్తలను నాయకులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని నా జోలికొస్తే పర్వాలేదు వదిలేస్తాను. టీడీపీ కార్యకర్తలు జోలికొస్తే ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టే ప్రసక్తే లేదంటూ చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఖబర్దార్ అంటూ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని హెచ్చరించారు. చెవిరెడ్డి తనపై నిందారోపణ రాజకీయాలు చేయడం మొదలు పెట్టాడని, అతను చేసిన దొంగ ఓట్లు, అక్రమాలకు సంబంధించి విచారణలకు లేఖలు పంపడంతో జీర్ణించుకోలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చంద్రగిరినియోజకవర్గంలో గతప్రభుత్వ హయాంలో చెవిరెడ్డి చేసిన అవినీతిపై ఎమ్మెల్యే నాని మాట్లాడారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకొని చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించిన అధికారులను వేధించి, బెదిరించి సాగించిన



అక్రమాలను త్వరలోనే బయటపెడతానని స్పష్టం చేశారు. తాను ఎవరి దగ్గరికి వెళ్లి సాయం పొందలేదని, ఇది నిరూపించడానికి ఎక్కడైనా సత్యం చేయడానికి తాను సిద్ధమని సవాల్ విసిరారు. తనకు చెందిన క్వారీలపై ఉద్దేశం పూర్వకంగా జరిమానాలు వేయిస్తే తాను కోర్టుకు వెళ్లి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకొని, వారిని నడపడానికి డబ్బులు లేక తన భార్య బంగారాన్ని కుదువ పెట్టి వారి పనులను సజావుగా నడిపించానన్నారు. అధికారంలో ఉన్నప్పుడు, ఇప్పుడు అధికారంలో లేనప్పుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలో ఎటువంటి మార్పు లేదని, అందుకు నిదర్శనమే అధికారులపై కోర్టు కేసులు పెడతానంటూ బెదిరించడమే నిదర్శనం అన్నారు. తుడా నిధులు 243 కోట్లు రూపాయలను నిబంధనలకు విరుద్ధంగా 6 మండలాలకు బదలాయించి వినియోగించారని, ఇంకా తుడా ద్వారా ఎన్నో అక్రమాలు చేశారని అన్నారు. వీటన్నింటిపై ఒక్కొక్కటిగా విచారణ చేయాలని నేను చేస్తున్న ప్రయత్నాలకు మాజీ ఎమ్మెల్యే కోపోద్రేపుడై నోటికొచ్చినట్టు మాట్లాడడం మంచిది కాదన్నారు. గత వైసిపి హాయంలో

మిగతా 2లో

## ఆధునిక హంగులతో నూతన బస్ స్టేషన్

### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ప్రస్తుతం ఉన్న సెంట్రల్ బస్‌స్టేషన్ స్థానంలో ఆధునిక హంగులతో నూతన బస్‌స్టేషన్ సముదాయాన్ని నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం సెంట్రల్ బస్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో శ్రీనివాసబస్టేసన్‌లో పెచ్చులు ఊడిపోయి ఉండటాన్ని పరిశీలించారు. పార్శల్‌ఆఫీసును పరిశీలించారు. అనంతరం శ్రీహరి బస్టాండ్‌లో దుఖాణదారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంఆర్‌పికే వస్తులు విక్రయించాలని సూచించారు. ధరల సూచిక బోర్డు తప్పని సరిగా షాపు ఎదుట పెట్టాలని ఆదేశించారు. బస్టాండ్ ఆవరణలోని టాయిలెట్స్‌ను పరిశీలించి, టాయిలెట్ వినియోగానికి ఇరవై రూపాయలు వసూళు చేస్తున్నారని ప్రయాణికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. టాయిలెట్ ఎదుట ధరల సూచిబోర్డు పెట్టించడంతో పాటు అధిక ధరలు వసూళ్ళపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రిక్ బస్సులో ఎమ్మెల్యే, ఇతర అధికారులు బస్టాండ్‌లోని ఏడుకొండలు బస్టేషన్, పల్లెవెలుగు బస్టేషన్లను పరిశీలించారు. ఆయిల్ డిపోను పరిశీలించారు. అలాగే ఆర్ఎం కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ప్రస్తుత బస్టేషన్ స్థానంలో ఆధునిక హంగులతో కొత్తగా ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ డిజైన్, డిపిఆర్‌ను ఆర్ఎం చెంగల్ రెడ్డి,డిప్యూటీ సిటీఎం భాస్కర్‌లు ఎమ్మెల్యేకి వివరించారు. 13.18 ఎకరాల్లో ఐదువందల కోట్లతో 13ఫ్లోర్స్‌తో ఇంటిగ్రేటెడ్ బస్‌టెర్మినల్‌ను నిర్మించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. నేషనల్ హైవే అథార్టీ,



మిగతా 2లో

## టీడీపీ కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్

(మొదటిపేజీ తరువాయి)



తెలుగుదేశం సానుభూతిపరులు ఊర్లు విడిచి వెళ్లి పోయాలా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రవర్తించారన్నారు. తనపై జరిగిన హత్యయత్నం ఘటనకు సంబంధించిన వీడియో పోలీసులకు కూడా దొరకలేదని, ఆ వీడియో మాజీ ఎమ్మెల్యేకు ఎలా చేరిందో పోలీస్ అధికారులు విచారణ చేయాలని కోరారు. ఎక్కడో గంజాయి బ్యాచ్లు వారికి వారు ఘర్షణ పడితే దాన్ని తమ పార్టీపై నెట్టడం సరికాదన్నారు. గత వైసిపి ప్రభుత్వ హాయంలో చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లకు సంబంధించి, నిధుల గోల్మాల్, భూముల విషయాలలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తప్పకుండా జైలుకు పోతారన్నారు. ఏ పదవి కోసం తాను ప్రాకులాడలేదని, ఇచ్చిన బాధ్యతను చక్కగా నిర్వర్తించే పద్ధతిని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్లు తమకు నేర్పించారన్నారు. చంద్రగిరి నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేయాలని తాను ప్రణాళికలు వేస్తుంటే అభివృద్ధికి అడ్డంకిలా మారి ఇలా వివాదాస్పదంగా మాట్లాడి డైవర్షన్ పాలిటిక్స్ చేయడం చెవిరెడ్డికి మంచిది కాదని హితవు పలికారు. తనపై జరిగిన హత్యాయత్నంకు సంబంధించి చెవిరెడ్డి కుటుంబానికి సంబంధించిన వ్యక్తుల పాత్ర ఉందని, వారం రోజుల్లో చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన అక్రమాలకు సంబంధించి పూర్తి వివరాలతో మీడియా ముందుకు వస్తానని స్పష్టం చేశారు. నమ్మిన వారిని మోసం చేయడం చెవిరెడ్డి వంతుయితే, నమ్మిన కార్యకర్తలకు అండగా నిలిచి వారిని ప్రేమించడం పులివర్తి నాని వంతని తెలియజేశారు. ఇకనైనా నీ బుద్ధి మార్చుకోకపోతే రాజకీయాలకు దూరమవుతావని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, అలిమినేని మధు, సుబ్రహ్మణ్యం నాయుడు, సురేష్ రెడ్డి, సి.మధు శేఖర్, సుధా గౌడ్ పాల్గొన్నారు.

## ఆధునిక హంగులతో నూతన బస్ స్టేషన్

(మొదటిపేజీ తరువాయి)



రాష్ట్ర ప్రభుత్వ వాటతో పాటు థర్డ్ పార్టీతో ఈ టెర్మినల్ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యేకి వివరించారు. డిజైన్ తుది ఆమోద దశలో ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి టెర్మినల్ విషయం తీసుకెళ్ళి త్వరలో టెండర్ల పిలిచి మూడేళ్ళలో కొత్త బస్టేషన్ అన్ని హంగులతో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఇప్పటికే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. రేణిగుంట విమానాశ్రయం అందుబాటులో ఉండటంతో ఆధ్యాత్మిక నగరం ఆధునిక నగరంగా మార్చేందుకు అన్ని విధాల కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు నరిసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, మహేష్ యాదవ్, కంకణాల రజినీకాంత్ నాయుడు, ఊత మాకుల హేమంత్ కుమార్ యాదవ్, గాలి పవన్, జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రాజారెడ్డి, నెలవాయి మురళీ కృష్ణ, మోహన్ రాయల్, సుధా, రాజేష్ ఆచ్చారి, అయ్యప్ప, బిజేపి నాయకులు వరప్రసాద్, తేజోవతి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా అర్జున తపస్సు

**శ్రీకాళహస్తి, మేజర్న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధం శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు వైభవంగా నిర్వహించారు. అర్జున స్వామి ఉత్సవ మూర్తిని కొలువు తీర్చి శివ ధనస్సు కోసం అర్జునుడు ప్రార్ధించి తాటి మాను అధిరోహించారు. అర్జున వేష దారుడు విసిరే నిమ్మ పండ్ల కోసం భక్తులు పోటీలు పడి దక్కించుకోవడానికి విశ్వ ప్రయత్నం చేశారు. శ్రీకాళహస్తి శ్రీ ద్రౌపది ధర్మరాజు స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం సాయంత్రం అర్జున తపస్సు వైభవంగా చేపట్టారు. ఆలయ ఆవరణంలో తాటి మాను ఏర్పాటు చేసి అర్జునుడు శివయ్య అనుగ్రహం కోసం తపస్సు చేసి పాశుపతాస్త్రం సాధించే ఘటాన్ని చేపట్టారు. ధర్మరాజు స్వామి ఆలయం నుంచి విశిష్ట అలంకారాలు చేసిన అర్జున స్వామి ఉత్సవమూర్తి నీ మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి తాటి మాను ప్రతిష్టించిన చోట కొలువు తీర్చారు. అనంతరం శివుడు, అర్జునుడు వేషదారులు వాగివాదం చేసుకుంటూ బల ప్రదర్శన చేయడం చివరకు అర్జునుడు తాను యుద్ధం చేస్తున్నది పరమేశ్వరులతోని గ్రహించి శరణు కోరడంతో పరమేశ్వరుడు ప్రీతి చెంది అర్జునునికి పాశుపతాస్త్రం అనుగ్రహిస్తారు. అనంతరం అర్జునుడు వేషదారుడు తాటి మాను అధిరోహించి శివ కీర్తనలు ఆలపిస్తూ భక్తుల కోసం సిద్ధం చేసిన నిమ్మ పండ్లును భక్తులపైకి విసిరారు. అర్జునుడు వేషదారుడు విసిరే నిమ్మ పండుల కోసం భక్తులు పోటీలుపడి దక్కించుకునే ప్రయత్నం చేశారు. అనంతరం భక్తులు ఆలయంలోకి వెళ్లి ద్రౌపతి సమేత ధర్మరాజుల స్వామి మూల విరాట్లను దర్శించుకుని కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించా రు. ఉత్సవానికి పోలీసులు పటిష్టమై న బందోబస్తు కల్పించారు. శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల ప్రకారం భక్తులకు ఇటువంటి అసౌకర్యాలు కలగకుండా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి పోలీస్ సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవంలో ఈఓ ఎస్ఎన్వి.మూర్తి, ఏసీ మల్లికార్జున్ ప్రసాద్, ఆలయ అధికారులు నాగభూషణం, లక్ష్మయ్య పాల్గొన్నారు.



## రెస్కోలో తవ్వేకొద్దీ అవినీతి..?

(మొదటిపేజీ తరువాయి)



కుప్పం, మేజర్న్యూస్: వెనకబడిన కుప్పం నియోజకవర్గంలో వెలుగులు నింపేందుకు 1983 లో ఏర్పాటైన కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో) 2019 వరకు సజావుగానే సాగింది. 2019 లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఒక్కసారిగా అవినీతి కుపంలోకి కూరుకుపోయింది. ఉద్యోగ నియామకాలు పదోన్నతుల్లో 2019 నుంచి 2024 జూన్ వరకు వ్యవహరించిన పాలకవర్గం, ఉన్నత అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో 40 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలందించిన రెస్కో సంస్థకు మరకలు అంటుకోవడంతోపాటు ఉనికి ప్రశ్నార్ధకంగా మారే పరిస్థితి దాపరించింది.

**గత ప్రభుత్వహయంలో అవినీతికి ఆజ్యం..**

2019లో వైయస్సార్సీపి అధికారంలోకి రావడంతో రెస్కోలో నూతన పాలకవర్గం ఏర్పడింది. ఈ పాలకవర్గంలో చైర్మన్, 10 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం నాటి నుంచి విచ్చలవిడిగా వ్యవహరించడంతో ప్రస్తుతంరేస్కో భవితవ్యం ప్రశ్నార్ధకంగా మారింది. అప్పటికే రెస్కోకు విద్యుత్ సరఫరా చేస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ కు 400 కోట్లు మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి ఉద్యోగ నియామకాలు పదోన్నతులు తీసుకోరాదని కచ్చితంగా కో- ఆపరేటివ్ రూల్స్ చెబుతుంది. అయినా అప్పటి పాలకవర్గం రూల్స్ను పక్కనపెట్టి అనర్హత గల వ్యక్తిని ఎండీగా నియమించిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇంచార్జ్ ఎండిగా ఎంపికైన వ్యక్తి ఉద్యోగుల జీతాల బిల్లులకు సైతం సంతకాలు పెట్టేందుకు అనర్హుడు. కానీ ఇంచార్జ్ ఎండి హోదాలో ఉన్న వ్యక్తి ఉద్యోగుల జీతాల బిల్లులకు సంతకాలు చేయడంతో పాటు తనకు తాను లక్షల్లో జీతాలు పెట్టి డ్రా చేసుకొన్నట్లు తెలుస్తుంది. ఈ మొత్తం తతంగానికి ఎస్టాబ్లిష్మెంట్లోని మరో చిరు ఉద్యోగి సహకరించినట్లు తెలుస్తోంది. దీంతో రెస్కోలో అవినీతికి ఆజ్యం పోసినట్లయింది.

**ఉద్యోగ నియామకాలు, పదోన్నతులో నిబంధనలకు నీళ్లు...** గత ప్రభుత్వ హయాంలో రెస్కోలో ఉద్యోగులు, పదోన్నతుల కల్పనలో నిబంధనలకు నీళ్లు వదిలారు. అప్పటికే సంస్థపై 400కోట్లకు పైగా అప్పుల భారం ఉన్న బేఖాతరు చేస్తూ ఉన్న 130 ఉద్యోగులకు తోడు మరో 120 మందిని నియామకాలు చేసింది. ఒక్కొక్క ఉద్యోగి నుంచి 15 నుంచి 20లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా విచ్చలవిడిగా ఉన్న ఉద్యోగులకు లక్షల్లో లంచంగా తీసుకొని పదోన్నతులు కల్పించినట్లు గుసగుసలు వినపడుతుంది. ఇవే కాకుండా ఒక ఉద్యోగికి ఏకకాలంలో 11ఇంక్రీమెంట్లు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇవే కాకుండా ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ వైర్లు ఇతర పరికరాలు మీటర్లు కొనుగోలు కోట్లల్లో నగదు పాలకవర్గ చైర్మన్, ఎండికి ముట్టినట్లు కుప్పంలో కోడైకూస్తోంది.

**విచారణకు ఆదేశించిన ప్రస్తుత ప్రభుత్వం..**

గత ప్రభుత్వ హయాంలో రెస్కో సంస్థలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వం స్పందించింది. విచారణకు ఆదేశిస్తూ కో ఆపరేటివ్ అధికారి శ్రీలక్ష్మిని నియమించింది. అదేవిధంగా విజిలెన్సు అధికారుల సైతం అవినీతిపై విచారణకు రంగంలోకి దిగారు. ఉద్యోగ నియామకాలు పదోన్నతులు పరికరాలు కొనుగోల్లులో చోటుచేసకున్న అవినీతి అక్రమాలపై అంశాలవారీగా విచారణ చేపడుతున్నారు. దీంతో గత పాలకవర్గం, అధికారుల్లో గుభులు చుట్టుకొంది. అధికారులు టిడిపి నాయకులు, మంత్రులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తమను రక్షించాలని వేడుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

**120 మంది ఉద్యోగుల తొలగింపు...**

విచారణలో భాగంగా మొదటి అడుగుగా అక్రమ మార్గంలో ఉద్యోగాలు సంపాదించిన 120 మంది ఉద్యోగులను తొలగించినట్లు సమాచారం. అదేవిధంగా తాజా మాజీ ఎండిను సైతం తొలగించి ఏపీఎస్పీడీసీఎల్ నుంచి ఎండిని నియమించింది. తొలగింపుకు గురైన 120 మంది ఉద్యోగులు తమను కాపాడాలి అంటూ టిడిపి నాయకులు చుట్టు ప్రదక్షిణలు చేపడుతున్నారు. అదేవిధంగా తమను ఆదుకోవాలంటూ ముఖ్యమంత్రి సైతం కలిసేందుకు సిద్ధమవుతున్నారు.

**రెస్కో భవిష్యత్ ముఖ్యమంత్రి చేతుల్లోనే..**

పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రెస్కో భవితవ్యం ప్రశ్నార్ధకంగా మారింది. 500కోట్లకు పైగా అప్పులు, అక్రమ ఉద్యోగ నియామకాలు పదోన్నతుల్లో చోటుచేసుకున్న అవినీతి కారణంగా రెస్కో భవితవ్యం ప్రశ్నార్ధకంగా మారింది. ఇప్పటికే ఈ.ఆర్.సి పలుమార్లు రెస్కోను ఎస్పీడీసీఎల్ లో విలీనం చేయాలని స్పష్టంగా ఆదేశించిన ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు జరగలేదు. అదేవిధంగా రెండు సంవత్సరాలుగా రెస్కో సంస్థకు రెన్యువల్ కూడా లేకపోవడంతో సంస్థ మనుగడ కష్టంగానే మారింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఉన్న సంస్థ కావడంతో రెస్కో బౌతవ్యం ప్రస్తుతం ముఖ్యమంత్రి చేతుల్లోకి వెళ్ళింది. ముఖ్యమంత్రి నిర్ణయంతోనే రెస్కో భవిష్యత్తు తొలగించిన ఉద్యోగుల భవిష్యత్తు ఆధారపడి ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏ నిర్ణయం తీసుకుంటారు అని కుప్పం ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## జిల్లాలో నామినేటెడ్ పదవుల కోలాహలం

**చిత్తూరు బ్యూరో, మేజర్న్యూస్:**

జిల్లాలో నామినేటెడ్ పదవుల కోసం నేతల మధ్య పోటాపోటీ నెలకొంది. ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేసిన నేతలతో పాటు, ఐదేళ్లపాటు పార్టీ జెండా మోసిన కార్యకర్తలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. త్వరలో ప్రధాన పదవులను భర్తీ చేసే అవకాశం ఉండడంతో తెలుగుదేశం, జనసేన, బిజెపి నేతల మధ్య ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్పొరేషన్లతో పాటు జిల్లా స్థాయిలో డిసిసిబి, సిడిసిఎంఎస్ లాంటి ముఖ్యమైన పదవులు ఉన్నాయి. వీటితోపాటు ఆలయాలు, నీటి సంఘాలు, ఆహార సలహా సంఘాలు లాంటివి ఉన్నాయి. ఈ పదవులు ఎవరెవరికి ఎన్నెన్ని అనే విషయంలో సందిగ్గం నెలకొంది. తెలుగుదేశం పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో పదవులు ఆశిస్తున్నారు. అయితే జనసేన నుంచి కూడా పదవుల కోసం పోటీపడుతున్నారు. బిజెపి నేతలు కూడా ముఖ్యమైన పదవుల్లో తమకు కూడా అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. భారతీయ జనతా పార్టీ అయితే వాడుకు ముందుకేసి జిల్లాల వ్యాప్తంగానే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ ధర్మాదాయ పరిధిలోని దేవాలయాలకు సంబంధించి నామినేటెడ్ పదవులలో తమకు అత్యధిక పదవులు కోరేందుకు పార్టీ అధిష్టానాన్ని ఒప్పించే ప్రయత్నాలు చేస్తున్నాయి ఈ నేపథ్యంలో మూడు పార్టీల నేతలు అధిష్టానంలో తమకు అనుకూలమైన నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అయితే తెలుగుదేశం అధినాయకత్వం క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేసిన వారికే పదవులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం సర్వేలు కూడా నిర్వహిస్తున్నారు. ఎన్నికల సమయంలో పనిచేసిన వారి నుంచి కూడా సమాచారాన్ని తీసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసిన వారు, పార్టీ కోసం అంతర్గతంగా కృషి చేసిన వారి పేర్లు ప్రధానంగా తెరపైకి వస్తున్నాయి. ఎన్నికల్లో ఘన విజయం తర్వాత నామినేటెడ్ పదవుల్లో ఎవరి అదృష్టం ఎంత అనేది త్వరలో తేలనుంది. ఇక జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో కూడా పార్టీకి కష్టపడిన వారికి సమచిత న్యాయం జరగలేదని తెలుగు తమ్ముళ్లు పైకి సంతృప్తిగా కనిపిస్తున్న లోపల పార్టీ అధిష్టానం పై అసంతృప్తి కరంగా ఉన్నారు. జిల్లాకు సంబంధించి ఏడు నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రితో పాటు మరో మూడు నియోజకవర్గాలను కమ్మ సామాజిక వర్గానికి కేటాయించగా 2 నియోజకవర్గాలు ఎస్సీ రిజర్వుడు స్థానంలో ఇద్దరు పార్టీ తరపున గెలుపొందారు అలాగే రెడ్డి సామాజిక వర్గానికి సంబంధించి ఒక నియోజకవర్గం కేటాయించడం జరిగింది. మిగిలిన ఏ వర్గానికి శాసనసభ ఎన్నికల్లో సముచిత న్యాయం జరగలేదని కూడా తెలుగు తమ్ముళ్లలో ఆవేదన నెలకొంది. ఈ నేపథ్యంలో బలమైన కాపు సామాజిక వర్గానికి బిసి వర్గాలకు కనీసం నామినేటెడ్ పదవుల్లో అయినా అధిష్టానం సముచిత న్యాయం చేస్తుందో లేదో అనే డైలమాలో తెలుగు తమ్ముళ్లు ఎదురుచూస్తున్నారు. మరోపక్క క్లిష్ట సమయంలో పార్టీకి మద్దతు తెలిపిన జనసేన పార్టీ సైతం పార్టీకి కష్టపడిన నాయకులు కార్యకర్తలు కూడా ఇదే తరహాలో ఎదురుచూస్తూ ఉండడం మరో వంక రెండు పార్టీలకు తోడుగా భారతీయ జనతా పార్టీ కూడా ఈ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎవరికి ఎంత మేరకు న్యాయం చేస్తారో అని ఆశావాదులు ఎదురుచూస్తూ ఉన్నారు.

## పేదల భూమిలో అక్రమంగా రహదారి

**చిల్లకూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని కడివేడు రెవెన్యూలో పేదల భూమి ఆక్రమణపై తహసిల్దార్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. 1996లో ప్రభుత్వం కడివేడు గ్రామంలో హరిజనులకు కేటాయించిన భూమిని ఇటీవల పక్క గ్రామానికి చెందినవారు ఆక్రమణకు పాల్పడడంపై గతంలోనే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా తిరిగి ఆక్రమణదారు జాతీయ రహదారి నుంచి ఆక్రమణ పొలం వరకు రహదారి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిపై విచారించి చర్యలుత ఈసుకుంటామని రెవెన్యూ అధికారి పేర్కొన్నట్లు గ్రామస్తులు తెలిపారు. దీనిపై విఆర్‌ఓ బాలాజీని వివరణ కోరగా ఇప్పటికే గతంలో ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు సాగుతుందని అక్రమంగా ఇతరుల పొలంలో రహదారి ఏర్పాటుపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి పత్రం

**కోట, మేజర్‌న్యూస్:** మండలపరిధిలోని గూడలి పంచాయతీ సమస్యలపై గ్రామస్తులు ఎంఎల్ఏ డాక్టర్ పాశిం సునీల్‌కుమార్‌కు వినతి పత్రం అందచేశారు. శుక్రవారం ఉదయం చిట్ట మూరు మండల పర్యటనకు వెళుతున్న ఎమ్మెల్యే గూడూలి వద్ద గుమికూడిన ప్రజలను చూసివాహనాన్ని నిలుపదల చేశారు. గ్రామంలో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా మురుగు కాల్వలు, తాగు నీరు, రోడ్ల దుస్థితిపై వినతి పత్రంలో తెలియచేశారు. గ్రామస్తుల వినతి సానుకూలంగా స్పందించిన సునీల్‌కుమార్ సమస్యల పరిష్కారం కొరకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఉన్నత పాఠశాల సమీపంలో వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయుడు బాలిబోయిన రాధయ్య ఆద్వర్యంలో విజ్ఞప్తి చేయగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవల్సిందిగా ఆర్అండ్‌బి అధికారులకు సూచించారు.



## ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయండి

**పలమనేరు, మేజర్‌న్యూస్:** రూరల్ మండలంలోని ముసలామడుగు, సముద్ర పల్లె , గ్రామానికి అనుకొని ఉన్న కౌండిన్య నది నుండి ఇసుకను టిప్పర్, ట్రాక్టర్ లతోఇసుకను కౌండిన్యా నది నుండి వాహనాల ద్వారా తరలిస్తున్నారని రూరల్ మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, సింగల్ విండో అధ్యక్షులు రాజారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు విశ్వనాథరెడ్డి,వైస్ ఎంపీపీలు జయశ్రీ, గజేంద్ర, గోవిందప్పలు సమావేశం మధ్యలోవచ్చి తాసిల్దార్ రంగనాయకులకు వినతి పత్రాన్ని అందించారు. ఈ వినతి పత్రాన్ని కలెక్టర్ కూడా పంపామని వారు తెలిపారు. తక్షణం ఇసుక తరలించే వాహనాలను ఆపకపోతే రోడ్డుపై ధర్నా చేస్తామని వారు తెలిపారు. ముసలమడుగు, సముద్ర పల్లె తదితర ప్రాంతాలలో ఇసుక నిల్వలు ఉన్నాయని వాటిని వెంటనే సీజ్ చేయాలని వైసిపి వారు తాసిల్దార్ దృష్టికి తెలిపారు. తాసిల్దార్ వెంటనే స్పందించి తాను ఇప్పుడేఅధికారులకు తెలుపుతానన్నారు.





## గుర్తు తెలియని వాహనం ఢీ... జింక మృతి

**పలమనేరు, మేజర్‌న్యూస్:** చెన్నై బెంగళూరు జాతీయ రహదారిలో శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వాహనం మా మడుగు వద్ద రోడ్డు దాటుతున్న జింకను ఢీకొని వెళ్లిపోవడంతో జింక అక్కడే మృతి చెందినది. వెంటనే ఈ విషయం ఎఫ్ఆర్ఓ శివన్నకు తెలియడంతో సంబంధిత అధికారులైన సురేంద్ర, గార్డ్ రాధాకృష్ణలతో కలిసి సంఘటన జరిగినచోటకు బయలుదేరి వెళ్ళినారు.

## బడికి పంపండి... బంగారు భవ్యషత్ ఇవ్వండి

**బుచ్చినాయుడు కండ్రిగ, మేజర్‌న్యూస్:** మండలంలోని ఆదిలక్ష్మి గిరిజన కాలనీలో బడి బయట ఉన్న పిల్లల్ని బడికి పంపి వాళ్ళ బంగారు భవిష్యత్‌కి బాటలు వెయ్యాలని చదివిస్తేనే వాళ్ళభవిష్యత్ బంగారు భవిష్యత్ అవుతుందని మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం విద్యార్థుల తల్లి దండ్రులు గోగుల మునీంద్ర వెంకటమ్మ లకు చదువు పైన అవగాహన కల్పించి ఉపాధ్యాయురాలు జి వల్లెమ్మ సమక్షంలో మునీంద్ర కుమారులు వెంకటేష్, మహేంద్ర, కుమార్తె మునెమ్మలను బడిలో చేర్పించారు.





## వైష్ణవీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని పుదిపట్లలో వెలసిన వైష్ణవీదేవి ఆలయంలో రాహుకాలం సందర్బంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకురాలు శ్రావణి ఉదయాన్నే ఆలయంలోని ఆంజనేయ స్వామి వారిని, వైష్ణవి దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. అశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత వినోద్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## కాట్రగుంట పంచాయితీలో జోరుగా పారిశుద్ధ్య పనులు

**బాలాయపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి ఆదేశం మేరకు విస్తరణ అధికారి వారి సమక్షంలో కాట్రగుంట గ్రామపంచాయతీలోనిఅరిగేపల్లి రామాలయం వద్ద నిలిచి ఉన్నటువంటి వర్షపు నీరును, సిసి రోడ్డుకు ఇరువైపులా జెసిపి ద్వారా కాలువ ఏర్పాటు చేసి వర్షపు నీటిని తొలగించడం జరిగింది. గ్రామంలోని కాలువల్లో పూడిక తీత, కార్యకలాపాలను చేపట్టారు. పూడికలు, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, బావులు, కొళాయిలు, బోరుల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా వివిధ పనులు చేపట్టారు. వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇప్పటి నుంచే మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రభలకుండా చర్యలు చేపట్టారు. తాగునీటి సరఫరా పైపుల పరిస్థితి తనిఖీ, తాగు నీరు కలుషితం కాకుండా శ్రద్ద వహించారు. బ్లీచింగ్ వేయడం, తుప్పలు తొలగింపు, చేపట్టారు. ప్రజారోగ్య ఆవశ్యకత దృష్ట్యా పలు కార్యక్రమాలను నిర్వహించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలు రోడ్లపై చెత్త చెదారాలు తొలగించారు. విస్తరణ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని ముఖ్యంగా దోమల బెడద తగ్గి మలేరియా, టైఫాయిడ్. డెంగీ వంటి వ్యాధులు సోకకుండా నివారించవచ్చని, గ్రామస్తులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రీనివాసులు, సర్పంచ్ కప్పల మమత,పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్, మోహన్ రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగవేణి పాల్గొన్నారు.



## దివ్యాంగులు ఆర్థికంగా బలపడాలి

**కుప్పం, మేజర్‌న్యూస్:** కేంద్ర ప్రభుత్వ కాంపోసిట్ రీజినల్ సెంటర్ సి ఆర్ సి వారి ఆధ్వర్యంలో కుప్పం లయన్స్ క్లబ్ వారి సహకారంతో విక్టరీ బధిర పాఠశాల చిన్నశెట్టిపల్లి నందు దివ్యాంగులకు మెగా జాబ్ మేళా నిర్వహించడం జరిగింది.ఇందులో దివంగులైన 18 సంవత్సరాలు నిండిన వారికి వివిధ వృత్తుల యందు శిక్షణ మరియు ఉపాధి కల్పన కొరకు ఈ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపునకు చిత్తూరు జిల్లా నలుమూలల నుండి దాదాపు 82 దివ్యాంగులు హాజరై, ఈ శిక్షణా తరగతులకు నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఆర్సి స్కిల్ డెవలప్మెంట్ రీహాబిలిటేషన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ దేవి ప్రియ మాట్లాడుతూ దివ్యాంగులు వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడాలని, ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతాలలో ఉన్న దివ్యాంగుల కోసం కేంద్ర ప్రభుత్వం నైపుణ్య శిక్షణ మరియు ఉద్యోగ కల్పన కోసం ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయబడుతున్నది. కావున దివ్యాంగులు అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేష్, మాజీ అధ్యక్షులు సత్యేంద్ర శేఖర్, సెక్రెటరీ సెంథిల్ కుమార్, కోశాధికారి చరణ్, సభ్యులు పీజీ సెల్వం, డాక్టర్ కృష్ణమూర్తి, స్పందన్ ఇతర స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు. అదేవిధంగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు హర్షధర్మతేజ మరియు కుటుంబ సభ్యులు భోజన సదుపాయం కల్పించారు.



## కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల్లో వేగం పెంచండి

**స్మార్ట్ సిటీ ఎం.డి. అదితిసింగ్**

**తిరుపతి నగరం, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరంలో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల్లో వేగం పెంచాలని తిరుపతి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ మంగళవారం అధికారులు, కాంట్రాక్ట్ నిర్వాహకులనుసమీక్ష సమావేశం నిర్వహించారు. కమాండ్‌కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, ఏఈకామ్, కాంట్రాక్టు ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అదితిసింగ్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్న ఈ సెంటర్ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

అధికారులు, నిర్మాణ నిర్వాహకులు సమన్వయం చేసుకుని పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. పనుల్లో జాప్యం జరగకుండా అనుకున్న మేర పనుల పూర్తి చేయాలన్నారు. ఈ కేంద్రం ద్వారా నగరంలో భద్రత మరింత పెరుగుతుందని, నగరంలో ఏ మూల ఏమి జరిగినా క్షణాల్లో తెలిసే విధంగా సెంటర్ పనిచేస్తుందన్నారు. అలాగే వాహనాల రాకపోకల నియంత్రణ, నగరంలో కాలుష్య నియంత్రణ, యూజర్ చార్జీల వసూళ్లు, అపరాధ రుసుము విధింపు వంటి కార్యక్రమాలు ఈ సెంటర్ ద్వారానే సాగుతుందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నాయుడుపేట పట్టణంలో ఆక్రమణలను తొలగిస్తాం

**మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్ధన్ రెడ్డి**

**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** నాయుడుపేట పట్టణంలో పారిశుధ్య పరిరక్షణకు మరియు ట్రాఫిక్ నియంత్రణకు అడ్డంకిగా మారుతున్న ఆక్రమణలను ఎట్టి పరిస్థితులలో సహించేది లేదని, తొలగిస్తామని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఎం జనార్ధన్ రెడ్డి తెలిపారు. నాయుడుపేట పట్టణ వ్యాప్తంగా సైడ్ కాలవలను ఆక్రమించుకొని రాసి ట్రాఫిక్ ఇబ్బంది కలిగిస్తున్న ఆక్రమణలను తొలగిస్తామని ఆయన హెచ్చరించారు. రాబోవు వర్షాకాలంలో పట్టణంలో మురుగు నీరుచేరి రకరకాల వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందువల్ల మరుగునీటిని నిల్వచేరకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. సైడ్ కాల్వలను ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారస్తులు మునిసిపల్ శాఖ సిబ్బందితో సహకరిస్తూ తమ ఆక్రమణలను తామే స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు.



## ద్రావిడ విశ్వవిద్యాలయ ఇంచార్జ్ ఉపకులపతిగా ఎం.దొరస్వామి



**గుడిపల్లి, మేజర్‌న్యూస్:** ద్రావిడ విశ్వవిద్యాలయ ఇంచార్జ్ ఉపకులపతిగా ఆచార్య ఎం.దొరస్వామి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఉదయం వర్సిటీలోని శ్రీ వినాయక స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, వర్సిటీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామా రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పదవి బాధ్యతలు చేపట్టిన ఆయన వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని.. తనపై నమ్మకం ఉంచి ఇంచార్జ్ ఉపకులపతిగా నియమించడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, తూర్పు రాయలసీమ పట్టబదులు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఉన్నత విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వర్సిటీ బోధన బోధనతర సిబ్బంది ఆయనను కలిసి పుష్పగుచ్చాలు శాలువులతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఇన్చార్జి రిజిస్ట్రార్ ఎం మాధవ నాయుడు, డీన్ అకాడమిక్ అఫైర్స్ ఆచార్య కే శ్యామల, బోధన బోధ నేతల సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మరాజుల అగ్నిగుండం ప్రవేశానికి ఏర్పాట్లు పూర్తి

**- భక్తులు ప్రశాంతంగా అగ్నిగుండం ప్రవేశం**
**- శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఈవో మూర్తి**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధం ద్రౌపతి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో నిర్వహించే ద్రౌపతి సమేత ధర్మరాజుల బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని శ్రీకాళహస్తి నియోజకవర్గం. సత్యవేడు నియోజకవర్గంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఆదివారం రోజు నిర్వహించే అగ్నిగుండ మహోత్సవంలో పాల్గొనడానికి భక్తులు ద్రౌపతి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో ఆలయ అర్చకులతో కంకణాలు కట్టుకుంటూ మాలలు ధరిస్తున్నారు, ఆలయ అర్చకులు శాస్త్రంగా భక్తులకు కంకణాలు కడుతూ స్వామివారి మాలలను భక్తులు ఎంత నిష్టగా ఎటువంటి ఆచారాలతో పాటించాలో భక్తులకు వివరిస్తూ కంకణాలు కడుతున్నారు, కంకణ దారులైన భక్తులు ద్రౌపతి సమేత ధర్మరాజులు, భీమా, అర్జున, నకుల, సహదేవులను దర్శించుకుంటూన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం. సత్య వేదు నియోజకవర్గం. సూళ్లూరుపేట. వెంకటగిరి నియోజకవర్గాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆదివారం జరిగే అగ్నిగుండ మహోత్సవాన్ని కన్నుల పండుగగా తిలకిస్తారు. శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారులు అగ్నిగుండ మహోత్సవాన్ని పటిష్టంగా నిర్వహించి భక్తులకు ఎటువంటి అసౌక్రియలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.



కంకణాలు కట్టించుకుంటున్న భక్తులు

## బీసీ, ఎస్సీ హాస్టళ్లను ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఎమ్మెల్సీ శ్రీకాంత్

**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని బీసీ, ఎస్సీ హాస్టల్ లను శుక్రవారం ఉదయం టిడిపి కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హాస్టల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు దుప్పట్లు, బెడ్, దిండ్లు అందజేశారు. హాస్టల్‌లో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ లో విద్యుత్ దీపాలు, ఫ్యాన్ లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అందులో భాగంగానే కుప్పం మునిసిపాలిటీ పరిధిలోని బీసీ, ఎస్సీ హాస్టల్‌లను పడగొట్టి నూతన భవనాలు కట్టెందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హాస్టల్ లో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే సమస్యలు పరిష్కరిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ నేతలు ప్రతిరోజు ఒకరు హాస్టలను సందర్శించి విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకోవాలన్నారు. నాణ్యమైన, రుచికరమైన భోజనాలు విద్యార్థులకు అందించాలని ఆదేశించారు అనంతరం మునిస్వామిపురం కాలనీలో స్థానిక ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.





## 23 నుంచి కుప్పంలో నారా భువనేశ్వరి 4 రోజులు పర్యటన



**కుప్పం, మేజర్ న్యూస్:** టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఈనెల జూలై 23 నుంచి 26 వరకు కుప్పం నియోజకవర్గంలో 4 రోజులు పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం టీడీపీ ఇన్చార్జి పి.ఎస్. మునిరత్నం తెలిపారు. ఎన్నికల ముందు బూత్ ఇన్చార్జిలతో సమావేశమైన ఆమె అత్యధిక మెజార్టీ వచ్చిన బూతులను ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున దత్తత తీసుకుంటానని హామీనిచ్చారు. చంద్రబాబు నాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించిన కుప్పం ప్రజలకు కృతజ్ఞతలు తెలుపునున్నారు. నాలుగు మండలాల మహిళలతో ముఖాముఖిగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అధిక మెజార్టీ వచ్చిన కేంద్రాన్ని దత్తత తీసుకొని ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అభివృద్ధి చేస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన నేపథ్యంలో పై పాల్యం,కంచబధార్లపల్లి లలను దత్తత తీసుకోనున్నట్లు సమాచారం. అలాగే ప్రభుత్వ సహాయంతో ప్రత్యేక అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా ఆయా భూతుల పరిధిలో అన్ని కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేలా మహిళలతో ముఖాముఖిగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే

**- జిల్లా ఎస్పీ వాహనదారులకు హెచ్చరిక**

**తిరుపతి బ్యూరో మేజర్‌న్యూస్:** నగరంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డిఎస్పి రమణ కుమార్ ఆధ్వర్యంలో నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన డ్రైవర్లు కు పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నమోదు చేశారు. పట్టుబడిన 18 మంది ముద్దాయిలను 4వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి 10,000 వేలు చొప్పున మొత్తం 18 మందికి 1,80,000 జరిమానా విధించారు. అలాగే అధిక మోతాదులో మద్యం సేవించి ఆటో నడిపిన ఒక ఆటో డ్రైవర్‌కు 3 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. రోడ్డుపైన వాహనదారులకు, పాదచారులకు, ఇబ్బంది కలుగజేసే రోడ్డుకి ఇరువైపులా వ్యాపారాలు చేస్తూ ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న 60 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పెట్టగా ఒక్కొక్కరికి రూ.500లు చొప్పున మొత్తము రూ.30,000 వేలు జరిమానా విధిస్తూ స్పెషల్ కోర్ట్ ఇన్చార్జి మూడవ అదనపు జ్యుడీషియల్ సివిల్ జడ్జి తీర్పునిచ్చారు. మొదటిసారి మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానా విధిస్తామని, రెండోసారి అదే తప్పు చేస్తే జైలు శిక్షతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయటకు ప్రతిపాదించినట్లు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు.

## విద్యకే అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే గురజాల

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** టిడిపి ఓటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. శుక్రవారం నగరం లోని స్థానిక కన్నన్ ప్రభుత్వ పాఠశాల, గాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాల, సంతపేట లోని పి ఎన్ సి మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి లోకేష్ బాబుకు విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. నారా లోకేష్ విద్యా శాఖ మంత్రిగా అధునాతన విద్య విధానాలను అమలు చేస్తున్నారన్నారు. కన్నన్ ప్రభుత్వ పాఠశాలలో ప్రిన్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించారు. పాఠశాల మౌలిక వసతులకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సంతపేట పాఠశాల ఆవరణం ఎంతో ఆహ్వాదకరంగా ఉందన్నారు. ఈ వాతావరణంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఉన్నత చదువులు అభ్యసించాలని సూచించారు. అనంతరం



విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముదా, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ మేయర్ కటారి హేమలత, డీఈవో దేవరాజు, డి ఐ ఓ మౌలా, డివైఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈఓ సెల్వరాజ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కౌన్సిలర్లు



**కుప్పం, మేజర్ న్యూస్:** కుప్పం మున్సిపాలిటీకి నూతనంగా భాద్యతలు తీసుకున్న కమీషనర్ శ్రీనివాసరావు ను శుక్రవారం కౌన్సిలర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధి కి తమ వంతు కృషి చేస్తామని కౌన్సిలర్లు కమీషనర్ కు వివరించారు. మున్సిపాలిటీ పరిదిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించిన అనంతరం నూతన కమీషనర్ శ్రీనివాసరావు ను కౌన్సిలర్‌లు జిమ్ దాము,టీడీపీ నాయకులు ఉమాపతి, నరేష్ తదితరులు పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించారు.

## ఉద్యానవనం అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టికి



**రేణిగుంట, మేజర్‌న్యూస్:** గడిచిన 2014 ప్రభుత్వ హయాంలో తుడా నిధులతో నిర్మించిన అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కోటి రూపాయలు వెచ్చించి నిర్మించిన ఉద్యానవనం నేడు అరణ్యంగా మారిపోయిందని దీనిపై దృష్టి పెట్టి మల్ల పుణ ప్రారంభించే విధంగా చేయాలని స్థానిక ప్రజలు మండల అధికారులు ఫిర్యాదు చేయడంతో రేణిగుంట టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ రేణిగుంట ఎంపీడీవో విష్ణు చిరంజీవి, పిఓపిఆర్డి శుక్రవారం బిస్మిల్లా నగర్ ఉద్యానవనం స్థానికులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా ఉద్యానవనంలో ఏపుగా చెట్లు పెరిగిపోయి పిల్లలు ఆహ్లాదకరంగా ఆడుకునేదానికి, వృద్ధులు, మహిళలు వాకింగ్ చేసేందుకు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ మాజీ మంత్రి బొజ్జలు గోపాలకృష్ణారెడ్డి చేసిన అభివృద్ధి గడిచిన పాలకుల చేత నేడు వృధా అయిపోయిందని నేడు ఈ సమస్యను శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుదీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు చిరంజీవి, యు పి ఆర్ డి, రత్నమ్మ, రేణిగుంట పంచాయతీ కార్యదర్శి బాలసుబ్రమణ్యం, టిడిపి నాయకులు జగదీష్, కన్నన్ రెడ్డి కొరియర్ రవి, స్థానిక మహిళా ప్రజలు పాల్గొన్నారు.

# యూనివర్సిటీ పురోగతికి కృషి

**- మహిళా వర్సిటీ వీసీగా ఆచార్యులు వి.ఉమ బాధ్యతలు**



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పురోగతికి కృషి చేస్తానని విసి ప్రొఫెసర్ ఆచార్యులు వి.ఉమా తెలిపారు. శుక్రవారం విసి చాంబర్ శ్రీపద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ సోషల్ వర్క్ డిపార్ట్మెంట్ కి చెందిన ఆచార్యులు ప్రొఫెసర్ వి.ఉమ బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య వి.ఉమ, 1983 లో, విశ్వవిద్యాలయం స్థాపించినపుడు లెక్చరర్ విధులలో చేరారు. ఆమె టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ నుండి ఎమ్మెస్ డబ్ల్యూ పూర్తి చేసి విదేశాలలో పీహెచ్డీ పూర్తి చేశారు. ముప్పైఐదు సంవత్సరాల పైచిలుకు, బోధన, పరిశోధన అనుభవం కలిగి ఉన్నవారు. పలు జాతీయ అంతర్జాతీయ పబ్లికేషన్స్, బుక్స్ ప్రచురించారు. యూనివర్సిటీ ఆఫ్ ఆంగ్లియ, యుకే నుండి కామన్వెల్త్ అకడెమిక్ స్టాఫ్ స్కాలర్షిప్ ను, ఏపీ స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు. వీసీగా భాధ్యతలు స్వీరించిన ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను అందరి సమిష్టితో విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు మహిళల ఉన్నత భవిష్యత్తు కోసం స్థాపించిన యూనివర్సిటీ పురోగతికి కృషి చేస్తానని, రూసా ద్వారా వచ్చిన నిధుల ద్వారా యూనివర్సిటీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. తనపై నమ్మకంతో వీసీగా బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పరిపాలన భవనం వద్ద ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి అధికారులతో కలిసి పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధికారులు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రాగల ఆనంద్ గౌడ్, పత్తిపాటి వివేక్ తోపాటు పలువురు టీచింగ్, నాన్ టీచింగ్, ప్రొఫెసర్లు అధ్యాపకులు పుష్ప కుచేల అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజనీ, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.గీతావాణి పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలకు ఉపాధ్యాయులు పనిచేయాలి

**- తిరుపతి డివిజన్ విద్యాశాఖ అధికారులు**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం ఆర్పిబిఎస్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో తిరుపతి జిల్లాలో ప్రధాన ఉపాధ్యాయులకు క్లాస్ రూమ్ అబ్జర్వేషన్ బేస్డ్ ఆన్ టీచ్ టూల్ పేరిట శిక్షణ తరగతులను నిర్వహించారు, ఈ శిక్షణా తరగతులలో కేవిబి పురం, తొట్టంబేడు, శ్రీ కాళహస్తి, బిఎన్ కండ్రిగ, వెంకటగిరి, డక్కిలి బాలాయపల్లి, పెళ్లకూరు మండలాలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ప ప్రధానోపాధ్యాయలు ఈ శిక్షణ తరగతులలో పాల్గొన్నారు, ఈ శిక్షణా తరగతులలో తరగతి గదులలో ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యా బోధన ఏవిధంగా నిర్వహించాలో విద్యార్థులకు శిక్షణ బోధన పెంపొందించే విధంగా కార్యాచరణ ఏవిధంగా చేపట్టాలో ఈ శిక్షణా తరగతులలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకాళహస్తి ఎంఈఓ భువనేశ్వరి, ఎంఈఓ 2 బాలయ్య, శిక్షణ తరగతుల నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి డిస్టిక్ కోఆర్డినేటర్ నాగేంద్ర మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయుల ప్రతిభ మరింత మెరుగుపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలు, మెళకువలను అందించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఎంతో మేలు చేస్తుందని శ్రీకాళహస్తి ఎంఈఓ భువనేశ్వరి పేర్కొన్నారు. ముఖ్యంగా తరగతి గదిలో విద్యార్థుల ఏకాగ్రత, పాఠ్యాంశాలపై శ్రద్ధ పెట్టేలా సులభతరంగా బోధించేందుకు ఈ శిక్షణ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ శిక్షణ తరగతులు ఈ నెల 18నుంచి 27వరకు జరుగుతాయని పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో భువనేశ్వరి శ్రీకాళహస్తి ఎంఈఓ, బాలయ్య, శ్రీకాళహస్తి ఎంఈఓ నాగేంద్ర, క్లాస్ రూమ్ అబ్జర్వేషన్ బేస్డ్ ఆన్ టీచ్ టూల్ శిక్షణ తరగతుల డిస్టిక్ కోఆర్డినేటర్, పాల్గొన్నారు.



# శ్రీవారి సేవలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి



**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారిని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లీ దర్శించుకున్నారు. వేకువజాము శ్రీవారి అభిషేక సేవలో కుటుంబ సభ్యులతో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీ వారి తీర్థప్రసాదాలు అందజేసి జస్టిస్ హిమ కోహ్లీని పట్టువస్త్రంతో సత్కరించారు.

# గంజాయి నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ చేపడతాం

**: మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ**



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** ఆధ్యాత్మిక నగరం రోజురోజుకు పెరుగుతున్న వినియోగాన్ని కూకటి వేళ్ళతో వికలించి గంజాయి నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ స్పష్టం చేశారు. శుక్రవారం ప్లస్ క్లబ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గంజాయి కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, తిరుపతి నగరంలో ప్రశాంతత వాతావరణంలో నెలకొల్పడడమే తెలుగుదేశం పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో గంజాయి వినియోగంపై చర్యలు తీసుకోకపోవడంతొనే నేడు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో గంజాయి వినియోగంతో యువత పెడదారులు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి సేవించి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో దురాగతాలు జరగడానికి పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. తిరుపతిలోనే కాకుండా తిరుమలలో కూడా గంజాయి అమ్మకాలు, సేవించడం, పోలీసులు అదుపులోకి తీసుకోవడం గతంలో ప్రజలందరూ చూశారన్నారు. గురువారం రాత్రి తిరుపతి రాయల్ నగర్‌లో జరిగిన హింసాత్మక ఘటనను మత్తులో ఉన్నవారే చేయగలరన్నారు. భావితరాల యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందుకే కఠిన చర్యలు తీసుకోవడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా చేయడానికి రాష్ట్ర హోం మంత్రి అనిత ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హాయంలో తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే, ఆయన కుమారుడి అండతో నగరంలో ఏ చిన్న బడ్డీ కొట్టులో అయినా గంజాయి దొరికేదని ఆరోపించారు. దీని ద్వారా ఎంతో సొమ్మును వెనకేసుకున్నారన్నారు. ఈ సమావేశంలో టిడిపి నగర మహిళా అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ, నాయకురాళ్లు విజయ్ కుమారి, కుమారమ్మ, తరుణి, అనిత, జాహ్నవి పాల్గొన్నారు.

# కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల్లో వేగం పెంచండి

**: స్మార్ట్ సిటీ ఎం.డి.అదితీసింగ్**



**తిరుపతి బ్యూరో మేజర్ న్యూస్ :** నగరంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల్లో వేగం పెంచాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్ల, ఏఈకామ్, ఇంజనీరింగ్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్న ఈ సెంటర్ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అధికారులు, నిర్మాణ నిర్వాహకులు సమన్వయం చేసుకుని పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగకుండా అనుకున్న మేర పనుల పూర్తి చేయాలన్నారు. దీని ద్వారా నగరంలో భద్రత మరింత పెరుగుతుందని, నగరంలో ఏ మూల ఏమి జరిగినా క్షణాల్లో తెలిసే విధంగా సెంటర్ పనిచేస్తుందన్నారు. అలాగే వాహనాల రాకపోకల నియంత్రణ, నగరంలో కాలుష్య నియంత్రణ, యూజర్ చార్జీల వసూళ్లు, అపరాధ రుసుము విధింపు వంటి కార్యక్రమాలు ఈ సెంటర్ ద్వారానే సాగుతుందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# యస్వీయూ రిజిస్ట్రార్‌గా ఆచార్య భూపతి నాయుడు



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్:** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా ఆచార్య భూపతి నాయుడు బాధ్యతలు స్వీకరించారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా దూరవిద్య విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తున్న ఆచార్య ఎం. భూపతి నాయుడును నియమిస్తూ విసి. ఆచార్య అప్పారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం భూపతి నాయుడు రిజిస్టర్ గా తన చాంబర్లో బాధ్యతలు చేపట్టారు. ఆచార్య భూపతి నాయుడు 1997లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా యస్వీయూలో చేరారు. 27 సంవత్సరాల బోధనానుభవం గల భూపతి నాయుడు వివిధ కమిటీల్లో చురుకైన పాత్ర నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన రిజిస్టర్ భూపతి నాయుడుకు యస్వీయూ వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్లు, ఆచార్యులు, బోధనేతర సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వైభవంగా ధ్వజారోహణం

**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** మండలంలోని పచ్చికాపలం మహాభారతం ఉత్సవాలు ధ్వజారోహంతో శుక్రవారం మొదలయ్యాయి. ధ్వజారోహణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పచ్చికాపలంలో ఉన్న శ్రీకృష్ణ ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారతం ఉత్సవాలు శుక్రవారం నుండి మొదలైనట్లు కార్యనిర్వహకులు తెలిపారు. శుక్రవారం ధ్వజారోహంతో మొదలైన మహాభారతం ఉత్సవాలు 28వ తేదీ జరిగే అగ్నిగుండ ప్రవేశంతో ముగియనున్నట్లు తెలిపారు. పగలు హరికథా కాలక్షేపం, రాత్రులందు వీధి నాటకాలు ప్రదర్శింపబడునని తెలియజేశారు. ప్రజలు, భక్తులు సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కార్యనిర్వహకులు బండి గోవర్ధన్ రెడ్డి తెలిపారు.



# ఎస్వీయూ ఉపకులపతిగా ఆచార్య అప్పారావు బాధ్యతలు



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇన్చార్జి ఉపకులపతిగా ఆచార్య సిహెచ్ అప్పారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంచార్జ్ ఉపకులపతిగా ఆచార్య సిహెచ్. అప్పారావును నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు శుక్రవారం తన చాంబర్లో ఉపకులపతిగా ఆచార్య సిహెచ్ అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎస్వియులో 1989 నవంబర్లో బయోకెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2006లో ఆచార్యులుగా పదోన్నతి పొందారు. యస్వీయూలో డి.ఓ.ఏ. డైరెక్టర్‌గా, శాఖాధిపతిగా, బి.ఓయస్. ఛైర్మన్‌గా పనిచేశారు. సి.డి.సి. డీన్‌గా, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. యస్వీయూలో సీనియర్ ఆచార్యులైన ఆయనను ప్రభుత్వం ఇంచార్జ్ ఉపకులపతిగా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ రిజిస్ట్రార్ డా.చంద్రయ్య, రిజిస్టర్ ఆచార్య భూపతినాయుడు, ఆచార్య అమర్నాథ్, ఆచార్య త్యాగరాజు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థి సంఘ నాయకులు రాగల ఆనందగౌడ్, పత్తిపాటి వివేక్ హరికృష్ణ యాదవ్ తో పాటు పలువురు అధికారులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 17 విశ్వవిద్యాలయాలకు ఇంచార్జి ఉపకులపతులను నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం అంటే బీసీలు, బీసీలు అంటే తెలుగుదేశం అనే నినాదంతో స్థాపించిన తెలుగుదేశం ప్రభుత్వ పదవులలో సగభాగం బీసీలకు ఇవ్వడం హర్షించదగ్గ విషయం అన్నారు. ముఖ్యంగా 17 విశ్వవిద్యాలయాలలో ఏడూ విశ్వవిద్యాలయాలకు వివిధ బీసీ కులాలకు చెందిన సీనియర్ ప్రొఫెసర్లను ఇంచార్జి ఉపకులపతులుగా నియమించిన సీఎం చంద్రబాబుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో చేపట్టబోయే రెగ్యులర్ ఉప కులపతుల నియామకాలలో 60 శాతం బీసీ కులాలకు చెందిన ప్రొఫెసర్లకు అవకాశం కల్పించాలని కోరారు.



## రేపు గోవిందరాజ స్వామి ఆలయంలో పౌర్ణమి గరుడసేవ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** గురు పౌర్ణమి సందర్భంగా ప్రతినెల గరుడ సేవ నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈనెల 21 ఆదివారం గోవిందరాజు స్వామి ఆలయంలో వేడుకగా గరుడ సేవ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల మధ్య సర్వాలంకార భూషితుడైన స్వామివారు గరుడ వాహనంపై మాడ వీధులలో విహరించి భక్తులకు దర్శనమిస్తారు.

## హెూం వర్క్ రాయలేదని బాలికను చితకబాదిన ఉపాధ్యాయుడు

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలం లోని ఆమినిగుంటలో గల మండలపరిషత్ పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయుడు రమేష్ ఐదవ తరగతి చదివే బాలిక వాతలు పడేవిధంగా చితకబాదినట్లు బాలిక మేనత్త తెలిందింది. వివరాల ప్రకారం శుక్రవారం పాఠశాలకు వెళ్ళి తిరిగి వచ్చిన బాలిక కళ్ళు ఎందుకు ఎర్రగా ఉన్నాయని అడుగగా బాలిక ఉపాధ్యయుడు కొట్టినట్లు చెప్పిందన్నారు. ఈ విషయంపై మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వివరణ కోరగా గత రెండు రోజుల వరుస సెలవులు కావడంతో ఉపాధ్యాయుడు హెూం వర్క్ ఇచ్చాడని, బాలిక హెూం వర్క్ చేయలేదని, ఒంటిపైన వాతలు పడేటట్లు చితకబాదాడని ఈ విషయం మండల విధ్యాశాఖాధికారి వారి దృష్టికి తీసుకొని వెళ్లామని, ఇతను గతంలో కూడా ఆరేడు సార్లు ఈ విధంగా చేశాడని, అంతే కాకుండా నోటికి వచ్చినట్లు బూతులు కూడా తిడుతున్నారని చెప్పారు. ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**ఉపాధ్యాయుని వివరణ:** క్లాస్ రూంలో డ్యాన్స్‌లు వేస్తున్నారని, అప్పుడు ఒక దెబ్బ కొట్టినట్లు తెలిపారు.

**మండల విధ్యాశాఖ అధికారి వివరణ :** ఈ సంఘటన మాదృష్టికి వచ్చింది. విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

## ఆడి కృత్తిక గోడ పత్రిక ఆవిష్కరణ



**కుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలోని చెక్కునత్తం పంచాయతీ, కూసూరు గ్రామంలోని బాలసుబ్రమణ్యస్వామి దేవస్థానం ఆడి కృతిక కావళ్లు జాతర గోడ పత్రికలను శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు దేవస్థానంలో పూజలు చేసి ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, వివిఎస్ఎస్ ఛైర్మన్ కనకరాజు, ధర్మకర్తలు నాగవేలు, సుందర్, గోవిందస్వామి, పూజారి ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి

**కుప్పం, మేజర్‌న్యూస్:** సాయి మాత సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా అందత్వ నివారణ సంస్థ సహకారంతో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వారిచే నిర్వహించే మెగా ఉచిత కంటి ఆపరేషన్ల పరీక్షా శిబిరంను కుప్పం నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సాయి మాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్ బాబు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం 21న ఉదయం 9 గంటలకు కుప్పం ప్రభుత్వ హైస్కూల్ నందు ఉచిత మెగా ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కంటికి సంబంధించిన రోగులు కంటి చికిత్సలు చేసుకునేవారు ఉచితంగా కంటి కంటి చికిత్సతో పాటు కంటిలో శుక్లమున్న వారికి ఉచితముగా కంటి ఆపరేషన్లు నిర్వహించబడును కావున కంటి రోగులు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.వివరాలకు జగదీష్ బాబు సాయి మాత సేవ ట్రస్ట్ ఫోన్ నెంబర్ 9391833999 సంప్రదించగలరు.

## మహిళలకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

**తిరుపతి కల్చరల్ మేజర్ న్యూస్:** నవ భారత్ సేవా సమాజ్ ఎన్‌ఎస్‌ఎస్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు వృత్తి విద్య, నైపుణ్య శిక్షణ కోసం నూతన కేంద్రాన్నిసీనియర్ టిడిపి నాయకుడు మబ్బు దేవనారాయణరెడ్డి కట్టకిందపల్లి (కొత్తఊరు తిరుపతిలో ప్రారంభించారు ఈ కార్యక్రమంలో హెూటల్ భీమాస్ రెసిడెన్స్ కె.ఆర్.వెంకటాచలం, చక్ర హాస్పిటల్ డా అర్చన గౌరవ అతిథిలుగా పాల్గొన్నారు నవ భారత్ సేవా సమాజ్ ఎన్ఎస్ఎస్ సంస్థ ప్రధాన కార్యదర్శి రహమతుల్లా షరీఫ్ శిక్షణా కార్యక్రమానికి సంబంధించిన సామాగ్రిని అందజేసి 3 నెలల ఉచిత టైలరింగ్ శిక్షణ కోర్సు పూర్తి చేసుకున్న మహిళలకు జన్ శిక్షణ సంస్థాన్ శాఖ (మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంట్రప్రెన్యూర్‌షిప్, భారత కేంద్ర ప్రభుత్వం) నుండి సబ్సిడీ రుణం పొందేందుకు సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపి వారు ఆర్థికంగా ఎదిగి కుటుంబాన్ని ఆదుకోవాలని మరియు వారి పిల్లలను గొప్ప చదువు చదివించాలన్నారు. ఈ కార్యక్రమలో జనశిక్షణ సంస్థాన్ శాఖ అధికారి సుధాకర్ నవ భారత్ సేవా సమాజ్ సిబ్బంది డి.సుజాత పి లావణ్య బి చందన ఎస్పీ రిజ్వానా ఎ సురేఖ సుమలత పద్మ, టైలరింగ్ శిక్షణా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలంటే ఉలికిపాటు ఎందుకు బోసన్నా

– ప్రభుత్వం నిర్ణయం మేరకు ఎన్నికలకు మేం సిద్ధం
– గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై విచారణ జరగాలి



**పలమనేరు, వి.కోట మేజర్‌న్యూస్:** పలమనేరు బాలాజీ కో ఆపరేటివ్ సూపర్ బజార్ ఎన్నికలు అంతే ఉలికిపాటు ఎందుకు బోసన్నా అంటూ పల మనేరు టిడిపి నాయకులు ప్రశ్నించారు. రెండు రోజులుగా సూపర్ బజార్ ఎన్నికల అంశమై పలువురికి వాయిస్ మెసేజ్ వస్తున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన వారు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గిరిబాబు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖాజాపీర్, మాజీ కౌన్సిలర్ మదన్మోహన్ గౌడ్ లు ప్రశం గించారు. 2011లో సూపర్ బజార్ ఎన్నికలు అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ఇప్పటిదాకా ఎన్నికలు జరగలేదు. అప్పట్లో తెలుగుదేశం తరపున బోసు గెలిచారు. ఈ ఎన్నికలకు ఐదు సంవత్సరాల కాల పరిమితి ఉంటుంది ఆ లెక్కన 2016 లో ఎన్నికలు జరగాలి అయితే ఇప్పటిదాకా ఎందుకు జరగలేదు. 2022 వరకు ఎన్నికల పేరు ఎత్తకుండా, వైసిపి వాళ్ళతో కుమ్మక్కై, ఎన్నికలు జరగకుండా చేసింది ఎవరు? చిత్తశుద్ధి ఉంటే 2016 లో ఎన్నికలు జరిపేవాడివి. 2016 నుండి ప్రతి ఆరు నెలలకు ఇప్పటిదాకా 15 సార్లు నీ పదవిని పొడిగించుకొన్న మాట వాస్తవం కాదా?ప్రజల కోసమే అయితే ఇన్ని రోజులు ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదు. ప్రజాభిప్రాయం అంటే మీకు పట్టదా? లేక ప్రజాస్వామ్య విలువలు మీరు పాటించరా? తెలుగుదేశం పార్టీ మద్దతుతో గెలిచిన నీవు వైసీపీతో కలిసి ఎన్నికలు జరగకుండా ఆపింది నిజం కాదా? ప్రభుత్వ పర్సన్ ఇంచార్జ్ ఎందుకు ఎన్నికలు జరుపకూడదు. పర్సన్ ఇంచార్జ్ నియామకం కూడా 4-8-2024 వరకే కదా ఇంతలో అంత ఆందోళన ఎందుకు? పర్సన్ ఇంచార్జ్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగితే నీ బండారం బయటపడు తుందని భయపడుతున్నావా? నీకు వచ్చే కమీషన్లు రాకుండా పోతాయనా. చిన్న ప్రొవిజినల్ అంగడి పెట్టుకుంటే ఐదు సంవత్సరాలలో ఎంత అభివృద్ధి జరుగుతుంది. ఇన్ని సంవత్సరాలుగా సూపర్ బజార్ ను నడిపావు ఎంత అభివృద్ధి జరగాలి. ఎంత జరిగింది? అభివృద్ధి మొత్తం మీ జేబు చేరిందా?కనీసం డైరెక్టర్లకు కూడా సూపర్ బజార్ అంటే ఏమో తెలియకుండా చేశావు. డీసీసీబీ , డీసీ ఎమ్మెస్‌ల ద్వారా ఈ 5 సం.ల కాలములో ఎంత అవినీతి జరిగిందో నీకు తెలిదా? ఏపిఎ సిఎస్‌ని అడిగిన తెలుస్తుంది. ఈ నియోజకవర్గంలో ఉన్నటు వంటి ఆస్తులు ఇప్పుడు ఎవరి అధీనంలో ఉన్నాయో ప్రజలందరికి తెలుసు, ఎవరికి అప్పనంగా అప్పగించారో తెలియనిది కాదు. వీటన్నింటి పై విచారణ జరపాల్సిన అవసరం ఉందా లేదా? ఈ 15 యేళ్ళలో లేని భాద ఇప్పుడే ఎందుకు వచ్చింది. ఎన్నికలంటే ఉలికిపాటు ఎందుకు? ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం గౌడ్, శ్రీధర్, బి.ఆర్.సి కుమార్,అమర్నాథ్ రెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్,నదీమ్, జిలనీ, బాలాజీ, సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు వార్తలు రాసిన విలేకరిపై చర్యలు తీసుకోవాలి

– కలెక్టర్‌కి టీడీపీ నాయకుల వినతి

**కార్వేటి నగరం, మేజర్‌న్యూస్:** తప్పుడు వార్తలు రాసిన విలేకరిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు మండల తెలుగుదేశం నాయకులు వినతి పత్రాలు అందజేశారు. స్థానిక సి ఐ కూడా ఫిర్యాదు చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. ఇలాంటి నియోజకవర్గంలో 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి కొంతమంది ఆశావాహులు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుని కలవడం జరిగింది. టికెట్ కోసం చాలా మంది విశ్వ ప్రయత్నాలు చేశారు. అందులో డాక్టర్ థామస్ ఒకరు. ప్రజలకు దగ్గరుండి సేవ చేయగలడని గమనించిన చంద్రబాబు నాయుడు డాక్టర్ థామస్‌ను ఎన్నుకొన్నారు. 2024 ఎన్నికల్లో కేవలం ఒక్క సంవత్సరం ముందు టికెట్ తీసుకొని అప్పటినుండి అలుపెరగక నిత్యం నియోజకవర్గంలో ఎక్కడో ఒకచోట ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రజల పక్షాన నిలిచాడు. డాక్టర్ థామస్ పై ప్రజల్లో విశేష ఆదరణ లభించి 2024 ఎన్నికల్లో చరిత్ర తిరగ రాశారు. సుమారు 27 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించారు. దీన్ని జీర్ణించుకోలేని వైఎస్ఆర్ పార్టీకి కోవర్టుగా పనిచేసే పబ్లిక్ టుడే రిపోర్టర్‌గా ముసుగు వేసుకొని ఎమ్మెల్యే థామస్ పై 15వ తారీఖున క్వారీ యజమానులపై ఎమ్మెల్యే స్వారీ అనే తప్పుడు కథనాలు ప్రచురించాడు. ఇలాంటి తప్పుడు కథనాలను ప్రచురించే రిపోర్టర్‌పై చెట్ట రిత్యా తగు చర్యలు తీసుకోవాలని కార్వేటి నగరం మండల తెలుగుదేశం పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి హేమంత్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బాబు, రాజు, కొంతమంది నాయకులు పాల్గొన్నారు.



## తప్పులు కప్పిపుచ్చుకునేందుకు జర్నలిస్టులపై విజయసాయిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు

– టీడీపీ మండలాధ్యక్షుడు గాలి మురళి నాయుడు

**తొట్టంబేడు, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలేకరులను ఒరేయ్ అనడం సిగ్గు పడాల్సిన విషయమని తప్పులను కప్పిపుచ్చుకునేందుకు బెదిరింపు ధోరణితో విజయసాయి మాట్లాడుతున్నారని తొట్టంబేడు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాలి మురళి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయసాయి రెడ్డికీ పిచ్చి పట్టిందని ప్రెస్ మీట్ కు వచ్చిన విలేకరులను ఒరేయ్, ఏరా అని అనడం సిగ్గు పడాల్సిన విషయమని ఆయనపై వచ్చిన విమర్శలకు సమాధానాలు ఇవ్వకుండా మీడియా ప్రతినిధులను కించపరుస్తూ మాట్లాడటం, కులాల ప్రస్తావన తీసుకొని రావడం ఏమిటని ప్రశ్నించారు. విజయసాయిరెడ్డి తప్పులు చేశారని ఆ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నాడని మీడియా సంస్థల యాజమాన్యాలు, విలేకరులపై ఆయన చేసిన విమర్శలకు. భవిష్యత్తులో మూల్యం చెల్లించుకుంటారని చెప్పారు. కామంతో, డబ్బు మదంతో విజయసాయిరెడ్డి కళ్లు మూసుకుపోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. విశాఖపట్నంలో చేసిన భు అక్రమాలపై కుటమి ప్రభుత్వం విచారణ జరిపి త్వరలోనే అన్ని లెక్కలు తెలుస్తుందని చెప్పారు.

## ప్రభుత్వ విధి విధానాలకు అనుగుణంగా మెడికల్ షాప్‌లు పనిచేయాలి

– శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు శ్రీకాళహస్తి పట్టణం కొత్తపేట శ్రీరామ కళ్యాణ మండపంలో శ్రీకాళహస్తిలోని కెమిస్ట్. డ్రగ్గిస్ట్, మెడికల్ షాప్ యాజమాన్లకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి పట్టణంలో మెడికల్ షాప్ యాజమాన్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణంలో ప్రతి మెడికల్ షాప్ యాజమాన్లు రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలకు అనుగుణంగా షాపులు నడపాలని తెలిపారు. అలాగే డ్రగ్ లైసెన్స్, ఫార్మసీస్ట్ సర్టిఫికెట్ షాప్ లో బహిరంగ ప్రదర్శన చేయాలని తెలిపారు. బిల్ బుక్, షెడ్యూల్- రిజిస్టర్ ప్రతి ఒక్కరు తప్పక వాడాలని తెలిపారు. గడువు ముగిసిన మందులు వేయుటకు ప్రత్యేక బాక్స్ ఉంచాలని తెలిపారు. నార్కోటిక్ డ్రగ్స్ కచ్చితంగా డాక్టర్ యొక్క ప్రిస్క్రిప్షన్ లేకుండా ప్రజలకు ఇవ్వకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కెమిస్ట్ అసోసియేషన్ సెక్రెటరీ రాము, శ్రీకాళహస్తి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మధుసూదన్ రావు. కమిటీ సభ్యులు, గౌరవ అధ్యక్షులు అమర జనార్ధన్, నంద, పట్టణంలోనీ మెడికల్ షాప్ యాజమాన్లు కెమిస్ట్రీలు పాల్గొన్నారు.

## సాయి విద్యానికేతన్‌లో కంటి వైద్య శిబిరం



**గూడూరు, మేజర్‌న్యూస్:** ఆహారంలో మార్పు సెల్‌ఫోన్‌లకు చిన్న వయస్సు నుంచే బానిసలు కావడం వలనే కంటిపై ప్రభావం పడుతున్నట్లు కంటి వైద్య నిపుణులు డాక్టర్ హారిక పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సాయి విద్యానికేతన్ పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహార లోపంతోనే కంటి సమస్యలు వస్తాయని ఇటువంటి వాటిపైన అవగాహన కల్పించడం కోసం ఈరోజు పాఠశాలలో కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. పాఠశాలలోని విద్యార్థులందరికీ కంటి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన కంటి అద్దాలను ఇవ్వడం జరిగింది. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ దయాకర్ మాట్లాడుతూ మా పాఠశాలలో ఇటువంటి చక్కటి కార్యక్రమం నిర్వహించినందుకు డాక్టర్ హారికకి ధన్యవాదాలు తెలియజేశారు. మున్ముందు ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని ఆ భగవంతుని ఆశీస్సులు హారికకి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ



**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని పూల తోటలో కీర్తిశేషులు వాసిలి అంకేశ్వరరావు జ్ఞాపకార్థం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. శుక్రవారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో నిరుపేదలైన ఇద్దరు దివ్యాంగులకు 24 వేల రూపాయల విలువ చేసే రెండు ట్రై సైకిల్‌లను వాసిలి ప్రవీణ్ కుమార్ తల్లి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసిలి ప్రవీణ్, 16వ వార్డు మాజీ కౌన్సిలర్ వాసిలి పావని, వాసిలి గిరిజమ్మ, ప్రసూనమ్మ, సుకన్య మరియు రెడ్ సంస్థ ప్రతినిధులు జానా సుధీర్, మెదూరు శ్రీనివాసాచారి, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదులు విధుల బహిష్కరణ



**నాయుడుపేట మేజర్‌న్యూస్:** విజయవాడలో న్యాయవాదులపై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి సారథ్యం వహించిన సీనియర్ న్యాయవాది పసల గంగా ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులైన శ్రీనివాసరావు మహేష్ సుధాకర్ అను న్యాయవాదులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, వారిపై దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరములుగా న్యాయవాదుల పట్ల అన్యాయంగా జరిగిన దాడులను అరికట్టడంలో గత ప్రభుత్వం విఫలమైందని, తమ న్యాయవాద విధులను నిజాయితీగా నిబద్ధతతో నిర్వర్తించడానికి అవసరమైన చర్యలు కొత్త ప్రభుత్వమైన తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బార్ అసోసియేషన్ సభ్యులందరూ నిందితులపై సత్వరం కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే తమ నిరసనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## వీపీఆర్‌ను కలిసిన కట్టా వెంకటరమణారెడ్డి



**నాయుడుపేట మేజర్‌న్యూస్:** నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరు నగరంలోని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నివాసంలో ఆయనను టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కట్టా వెంకటరమణారెడ్డి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి షిరిడి సాయిబాబా వస్త్రాలను అందజేశారు. గత వారం రోజుల క్రితం కట్టా. వెంకటరమణారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి సాయిబాబా దర్శనార్థం షిరిడీకి వెళ్లి సాయిబాబా దర్శనం అనంతరం గురువారం నాయుడుపేటకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో షిరిడి నుంచి తీసుకువచ్చిన సాయిబాబా వస్త్రాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి బహుకరించారు.

## రైల్వే మెడికల్ ఆఫీసర్‌కు ఘనంగా వీడ్కోలు

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ గూడూరు రైల్వే హాస్పిటల్లో డాక్టర్ గా విధులు నిర్వహిస్తున్నసీనియర్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుందర్ కుమార్ కి ఘనంగా వీడ్కోలుపలికారు. శుక్రవారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో ఇప్పటి వరకు గూడూరులో విధులు నిర్వహిస్తూ బదిలీపై తిరుపతి రైల్వే హాస్పిటల్ కు వెళుతున్న సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. అదే విధంగా గూడూరు రైల్వే హాస్పిటల్ నూతన వైద్యాధికారిగా నియమితులైన డాక్టర్ మేఘన కి ఘన స్వాగతం పలకడం జరిగింది. ఈకార్యక్రమంలో స్టేషన్ రైల్వే సూపరింటెంట్ పల్లం వెంకటేశ్వరరావు, చీఫ్ బుకింగ్ సూపర్వైజర్ ఆరేటి వెంకటేశ్వరరావు, మాజీ డిఆర్‌యు సిసి మెంబెర్ మయూరి శ్యామ్ యాదవ్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కే.బీ.ఎన్‌రాజేంద్రప్రసాద్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రవికుమార్, నాగరాజ ,పెంచలయ్య, తదితర రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.



## విద్యా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

### - ఎమ్మెల్యే ఆరణికి ఎస్‌ఎఫ్‌ఐ వినతి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** విద్యారంగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో ఆరణి శ్రీనివాసులను కలసి పరిష్కరించాల్సిన సమస్యలను వినతి రూపంలో అందజేశారు. టిటిడి కళాశాలలో సీట్లు పెంచి, సీటు పొందిన ప్రతి ఒక్కరికి హాస్టల్ సీటు కేటాయించాలని, తిరుపతి నగరంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ సాంఘిక, సంక్షేమ హాస్టల్స్ కి సొంత భవనాలు సమకూర్చి నిర్మాణం చేపట్టి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వ ఎస్ వి పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ కు నూతన భవనాలు నిర్మించాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు రియాంబర్స్ మెంట్, హాస్టల్ మెస్స్ బిల్లులు తక్షణమే విడుదల చేయడంతో పాటు 35,117,107,108, 77 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సమస్యలపై అసంబ్లీ సమావేశంలో ప్రభుత్వ ద్రుష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని కోరారు. దీనిపై సాలుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, రవి జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, నాయకులు నరేంద్ర శ్రీనివాస్, గణేష్, చైతు, రవీంద్ర పాల్గొన్నారు.





## శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం విఐపి విరామ సమయంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ప్రముఖ ఫిట్నెస్ ట్రైనర్ డినాజ్ వేర్వట్వాలలు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా.... ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించారు.

### ఉపాధి హామీ పథకం ద్వారా ఫిష్ పాండ్‌ల తవ్వకం

## గ్రామ పంచాయతీల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు

### - డ్వామా పథక సంచాలకులు సివి శ్రీనివాస్ ప్రసాద్

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** ఏర్పేడు మండలం మాధవమాల పంచాయతీలో ఉపాధి హామీ పథకం కూలీల ద్వారా ఫిష్ పాండ్ తవ్వకం పనిని డ్వామా పథక సంచాలకులు సివి శ్రీనివాస్ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేసి కూలీలతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ఫిష్ పాండ్ ను చెరువుల్లో త్రవ్వడం వలన గ్రామ పంచాయతీలు వేలం ద్వారా చెరువులను చేపల పెంపకంనకు లీజుకు ఇచ్చినప్పుడు లీజుదారుడు చిన్న చేపలను ఫిష్ పాండ్ లో వదిలి పెంచడం వలన మేత ఖర్చులు తగ్గుతాయి అదేవిధంగా చెరువులోని కొంత విస్తీర్ణంలో ఈ ఫిష్ పాండ్ ఉండడం వలన చిన్న చేపలకు రక్షణ ఉండి చేపల ఎదుగుదల తొందరగా జరిగిన తరువాత ఈ ఫిష్ పాండ్ నుండి చెరువులోనికి చేపలను వదులుకొనటం వలన అధిక చేపల దిగుబడి రావడానికి ఆస్కారం కలుగుతుందని డ్వామా పథక సంచాలకుల శ్రీనివాస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పనులు లేని కాలంలో కూలీలకు విరివిగా పనులు పెట్టాలని ఆదేశిస్తూ ఏర్పేడు మండలం మొత్తం మీద 833 మంది కూలీలు పని చేస్తున్నారని, సోమవారంకి కూలీలను పెంచాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న పీడీ

## సాధారణ మండల సర్వసభ్య సమావేశం

**పలమనేరు, మేజర్‌న్యూస్:** ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సాధారణ మండల సర్వసభ్య సమావేశం మండల ఎంపీపీ రోజా, వైస్ ఎంపీపీ జయశ్రీ అధ్యక్షతన ఇంచార్జ్ ఎంపీడీవో రాజేష్ నిర్వహించారు. ఇందులో ప్రధానంగా26 శాఖలకు చెందిన అధికారులు హాజరైనారు. ఒక్కో శాఖ అధికారులు ప్రజలు లేవనెత్తిన సమస్యలకు సమాధానం ఇవ్వాలి. ఇందులో వైద్య ఆరోగ్యశాఖ ఇటీవల కురిసిన వర్షాలకు ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ఉండడానికి ముందస్తు గ్రామాలలో అధికారులు పర్యటించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, బీసీజీ వ్యాక్సినేషన్ వేయడం జరిగింది. ప్రజలకుఆయాసం టీబి వ్యాధులు రాకుండా ఉండడానికి డబ్ల్యూహెచ్ఓ వాళ్లు 60 సంవత్సరాలు పైబడిన ప్రజలకు తప్పకుండా ఈ వ్యాక్సినేషన్ వేయించుకోవాలని సూచించారు. అనంతరం శిశు సంక్షేమ శాఖ వారు అంగనవాడి కేంద్రాలలో బాలింతలకు గర్భవతులకు ప్రతి నెల 25 కోడిగుడ్లు ఐరన్‌తో కూడిన పోషక కిటు, ఒక్క బాలింతకు ఐదు లీటర్లపాలు అందించారన్నారు. అనంతరం వ్యవసాయ శాఖమండలంలోని రైతులకు వేరుశనగ విత్తనాలుఇవ్వడం జరిగిందన్నారు. ఆర్.బి.కె కేంద్రాలను రైతు సేవ కేంద్రాలుగా మార్చడం జరిగిందన్నారు. అనంతరం రెవెన్యూ శాఖ అధికారులు రైతులకు పాసుబుక్కులు ఇవ్వడం జరిగిందన్నారు. రైతులు ఏవైనా సమస్యలు ఉంటేతన దృష్టికి తీసుకురావాలని తహశీల్దార్ రంగనాయకులు తెలిపారు. అనంతరం విద్యాశాఖప్రతి పిల్లవాడికి 15వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మిడ్ డే మీల్స్ విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో 5 కోడిగుడ్లుఇవ్వడం జరుగుతుందన్నారు.అనంతరం గృహ నిర్మాణ శాఖపేద ప్రజలకు ప్రభుత్వం అందించే గృహాలు కొన్ని పూర్తి అయినాయని మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ వారు గంటా ఊరుకు కాలనీకి ఒక కొత్త సబ్ స్టేషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. అదేవిధంగా ఎం కోటూరు గ్రామానికి కూడా ఒక సబ్ స్టేషన్ ఏర్పాటుచేస్తామన్నారు. ఈ రెండు ప్రాంతాలలో కొత్త సబ్ స్టేషన్ లు ఏర్పాటు అవితే ఓల్టేజి సమస్యఉండదని తెలిపారు. ఇరిగేషన్ శాఖ వారురూరల్ మండలంలోనిగంగన శిరసుప్రాజెక్ట్ పథకం 20.7 కోట్లు కు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఈ ప్రాజెక్టుపూర్తి అవుతేపట్టణానికి త్రాగునీటి సమస్యఉండదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రూరల్ కన్వీనర్ బాలాజీ నాయుడు, వైస్ ఎంపీపీ గజేంద్ర,సర్పంచుల సంఘం అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, గోవిందప్ప, రాజారెడ్డి, రంగనాథం, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# చిత్తూరు పార్లమెంటును ఎంఎస్ఎంఈ హబ్‌ల తీర్చిదిద్దుతా

**నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా**

**జిల్లా ప్రగతికి బాటలు వేస్తా**

**చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గాన్ని ఎంఎస్ఎంఈల హబ్‌గా తీర్చిదిద్దుతానని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు అన్నారు. చిత్తూరు పార్లమెంట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టించి సారించిన ప్రసాద్‌రావు తన పార్లమెంటు నియోజక వర్గంలో ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేసే అంశాలను, దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమీక్షిస్తున్నారు. చిన్న,మద్య., పెద్ద తరహా పరిశ్రమలను నెల కొల్పేందుకు కావలసిన మార్గాలను అన్వేషి స్తున్నారు. దీనికి సంబంధించిన విధివిధానా లను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్తూరు పార్లమెంట్ నియోజక వర్గంలో నెలకొల్పి, తద్వారా తాను చేపట్ట బోయే భవిష్యత్ కార్యాచరణను ఆవిష్కరించారు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా తాను చిత్తూరు పార్లమెంటు లోని ఏడు నియోజకవర్గాలలో నిరుద్యోగ సమస్యను గుర్తించినట్లు చెప్పారు. ఈ సమస్యకు పరిష్కారమార్గాన్ని ఎంఎస్ఎంలే చూపుతాయన్నారు. తాను పాల్గొన్న పలు బహిరంగ సభలు., సమావేశాలలో చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమల ఏర్పాట, వాటివల్ల వనగూడే ప్రయోజనాల గురించి, సమగ్రంగా ప్రజలకు వివరించినట్లు గుర్తు చేశారు. అంతేకాకుండా ఎంఎస్ఎంఈలను నెలకొల్పడం వలన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని, తద్వారా నిరుద్యోగ సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపిన వారమవుతామని మాకేం తెలుసు ప్రసాద రావు చెప్పారు. దీంతో చిత్తూరు జిల్లా ప్రగతి పథం వైపు అడుగులేసేందుకు గ్రోత్ ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఏంఎస్ఎంఈల రూపకల్పనకు బీజం పడుతుందని ఆయన వివరించారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పని చేస్తున్నందుకు చాలా గర్వంగా ఉందన్నారు.

# తిరుమలకు కాలినడకన హెూంమంత్రి అనిత

**తిరుమల, మేజర్‌న్యూస్:** మొక్కులు చెల్లించుకోవడం కోసం నడకమార్గంలో తిరుమలకు వచ్చాం. నియోజకవర్గ ప్రజలతో కలసి నడుచుకుంటూ తిరుమలకు రావడం చాలా సంతోషం. నడకమార్గంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఫెన్సింగ్ కోసం 10 కోట్లు విడుదల చేసింది. కొన్ని దుడ్డ కర్రలు భక్తుల చేతిలో కనపడ్డాయి. వాటికి సైతం స్టిక్కర్లు అంటింది క్రూర మృగాలను కొట్టేందుకు అప్పటి పాలక మండలి దుడ్డుకర్రలు ఇచ్చాయని భక్తులు ఎగతాళి చేస్తున్నారు. అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటాం. నడక దారిలోనే టోకెన్స్ జారీ చేయాలి. ఎంపిడిఓ వెంకటరమణ ఆచూకి కోసం ముమ్మరంగా గాలింపు చేర్యాలు చేవడుతున్నాం. ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపడుతున్నాం. గవర్నమెంట్ ఉద్యోగులకు ఒత్తిడిలేకుండా చూస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుంది.



# 28ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**కారుతో సహా ముగ్గురు అరెస్టు**




**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** దొంగ చాటుగా అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని కారుతోపాటు ముగ్గురు స్మగ్లర్లు అరెస్టు చేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. టాస్క్ ఫోర్స్ ఎస్పీ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీ చెంచుబాబు సూచనలతో కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ నరేష్ బృందం, అటవీ సిబ్బంది సహకారంతో గురువారం ప్రకాశం జిల్లా కొమరోలు మండలం వైపు ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు తనిఖీ చేపట్టారు. ప్రకాశం టెరిటోరియల్ ఫారెస్టు డివిజన్ బెస్తవారి పేట రేంజి తాటిచెర్ల సెక్షన్, నల్లకుంట్ల అటవీ బీటు పరిధిలోని అక్కాపల్లి చెరువు వద్దకు అర్ధరాత్రి చేరుకున్నారు.

ఆ ప్రదేశంలో కారును నిలిపి అందులో ఎర్రచందనం దుంగలను ఎక్కిస్తూ స్మగ్లర్లు కంటపడ్డారు. దీంతో వారిని టాస్క్ ఫోర్సు సిబ్బంది చుట్టుముట్టగా, వారు వాహనం వదిలి పారిపోవడానికి ప్రయత్నించారు. అయితే వారిని వెంబడించి ముగ్గురి స్మగ్లర్లను పట్టుకున్నారు. ఆ ప్రాంతంలో 11, కాలులో 17 ఎర్రచందనం దుంగలు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ప్రకాశం జిల్లా ఒంగోలు టౌన్ కు చెందిన పేరం రామరాజు (44), సంచర్ల పంచాయితీ రామేశ్వరం గ్రామానికి చెందిన రాచకొండ రామయ్య (25), క్రిష్ణంశెట్టి పల్లి మండలం షేక్ ఖాసిం (43)లుగా గుర్తించారు. పేరం రామరాజు అనే వ్యక్తికి తమిళనాడుకు చెందిన స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో తెలిసింది. తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీస్ స్టేషన్లో సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజలతో మమేకమవుదాం.. పేదలకు సేవ చేద్దాం

**ద్వితీయ శ్రేణి నాయకత్వానికే పదవుల్లో ప్రాధాన్యం**

**దళితుల అభ్యున్నతికే అగ్రతాంబూలం**

**ప్రారంభోత్సవాలలో**

**గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్**



**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** పేదలకు సేవే లక్ష్యంగా, ప్రజలతో మమేకమై,నిత్యం ప్రజల్లో ఉంటూ,ప్రజా క్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రజారంజక పాలన కొనసాగుతుందని అందుకు అందరూ కంకణబద్ధులై సేవ చేద్దామని గూడూరు శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తెదేపా చిట్టమూరు మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు అధ్యక్షతన మండలంలోని ఈశ్వరవాక, అరవపాలెంలలో నూతనంగా నిర్మించిన పలు అభివృద్ధి పనులకు ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ద్వితీయ శ్రేణి నాయకత్వానికే పదవుల్లో ప్రాధాన్యం, దళితుల అభ్యున్నతికి అగ్రస్థానం ఉంటుందని స్పష్టం చేశారు. ఐదేళ్ల వైకాపా అవినీతి, రాక్షస పాలనలో దళితులు దగాపడ్డారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల నిధులను పక్కదారి పట్టించి,వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి మరిచి, ఎస్సీలపై నిర్బంధాలు కొనసాగించారన్నారు. వైకాపా ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడిన ప్రజానీకానికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపిన ఆయన గత పాలకుల పాపంతో రాష్ట్రం అప్పులు కుప్పగా మారి అభివృద్ధికి శాపంగా మారిందన్నారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని, ఇచ్చిన మాటకు కట్టుబడి 3వేల పింఛన్‌ను 4వేలకు పెంచి మొదటి నెల పెంచిన వెయ్యిని కలిపి 7వేలు పంపిణీ చేశామన్నారు. అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని త్వరలో పేదోడి కడుపు నింపే అన్న క్యాంటీన్లు, మహిళలకు ఉచిత బస్సు రవాణాతో పాటు సూపర్ సిక్స్ పథకాల అమలు చేస్తామన్నారు. ఇసుక, మట్టి, గ్రావెల్, తెల్లరాయి, మైకా, సిలికా వంటి సంపదను ఐదేళ్లలో వైకాపా నాయకులు అడ్డంగా దొరికినంత దోచేశారని విమర్శించారు. అంతకు ముందు ఈశ్వరవాక, అరవపాలెంలలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలు, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనాలను ప్రారంభించి, కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటి, బయ్యవారికండ్రిగ వద్ద 5కోట్ల 35 లక్షల అంచనాలతో నిర్మించనున్న తారురోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గెలిచిన తరువాత రెండవసారి చిట్టమూరు పర్యటనకు విచ్చేసిన ఆయనకు స్థానిక నాయకులు పూల వర్షంతో స్వాగతం పలికి, గజమాలలతో సత్కరించి,పూలమాలు శాలువాలతో సన్మానించి, ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసీ సభ్యురాలు దువ్వూరు భారతమ్మ,తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కామిరెడ్డి సునీల్ రెడ్డి,తిరుపతి పార్లమెంటు రైతు అధికార ప్రతినిధి మారంరెడ్డి జనార్దన్ రెడ్డి, తెదేపా బీసీ సెల్ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి గుండుబోయిన కస్తూరయ్య యాదవ్,తిరుపతి పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు, అరవపాలెం సర్పంచ్ నల్లారెడ్డి రాజేష్ రెడ్డి,గూడూరు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బసివిరెడ్డి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు వెదనపర్తి రాజగోపాల్ రెడ్డి,కోటి సుబ్రహ్మణ్యం, కాపులూరు చెంచు రామయ్య ఆచారి,బత్తల బలరామయ్య,రామిశెట్టి పవన్, భాజపా, జనసేన నాయకులు, తహసిల్దార్ శ్రీనివాస్ శర్మ, ఎంపీడీవో నాగరాజు,ఎస్ఐ చిన్న బల రామయ్య, ఏపీఎం ఉమాదేవి అన్ని శాఖల అధికారులు, సర్పంచులతో పాటు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జనం కోసమే సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు

నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.

మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232

ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

## ఎమ్మెల్యే బొజ్జల చొరవ మరువలేనిది

**- యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్**



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సమస్య పరిష్కారంపై చూపిన చొరవ మరువలేనిదని శ్రీకాళహస్తి డివిజన్ యునైటేడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ పాస్టర్లు తెలిపారు. గతంలో బసవయ్యపాలెం సమీపంలో క్రైస్తవుల స్మశాన వాటికకు ఐదు ఎకరాలు భూమిని కేటాయించడం జరిగిందన్నారు. అయితే గత రెండేళ్ల క్రితం క్రైస్తవుల స్మశాన వాటిక స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకోవడం జరిగిందన్నారు. ఈ విషయమై శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డినీ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ పాస్టర్లు కలిసి ఆక్రమణ గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే క్రైస్తవుల స్థలాన్ని కబ్జాదారుల నుండి విడిపించాలని తొట్టంబేడు తాహసిల్దార్ కి ఆదేశించినట్లు చెప్పారు. వెంటనే తాహసిల్దార్ స్పందించి స్మశాన వాటిక స్థలాన్ని వీలైనంత త్వరగా కబ్జాదారుల నుండి విడిపించి ఇస్తామని పేర్కొన్నట్టు చెప్పారు. సమస్య పై స్పందించిన ఎమ్మెల్యేకు, తాహసిల్దార్ కు క్రైస్తవులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆర్కే బీబీపేట సచివాల యాన్ని తనిఖీ



**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** మండలం ఆర్కేవి బి పేట సచివాల యాన్ని జిల్లా గణాంకాల అధికారి జడ్ శుక్రవారం తనిఖీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల ఆర్కే వీధి పేట విద్యార్థులతో ఆరో గ్యం పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది. ఉన్నత పాఠశాల సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీజీఏ వైస్ చైర్మన్‌గా వడ్లపాటి శేఖర్ ఏకగ్రీవం

**చిత్తూరు అర్బన్ మేజర్‌న్యూస్:** విజయవాడ నగరం లో శుక్రవారం ఏపీ గ్రానైట్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా అసోసియేషన్ నాయకత్వానికి సంబంధించిన ఎన్నిక నిర్వహించడం జరిగింది, సందర్భంగా వడ్ల పార్టీ శేఖర్ మీడియాతో మాట్లాడుతూ శేఖర్ మాట్లాడుతూ స్టేట్ చైర్మన్ గా పీ మహేష్ , వైస్ చైర్మన్ గా వడ్లపాటి శేఖర్ బాబు, జాయింట్ సెక్రటరీ లు గా రాళ్లపల్లి మోహన్ నాయుడు, కొవి మురళి, బి అమర్నాథ్ ను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

## మొగిలి నాంచారమ్మ సేవలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



**వరదయ్యపాలెం, మేజర్‌న్యూస్:** మండలంలోని కువ్వకొల్లి గ్రామ దేవత మొగిలి నాంచారమ్మ అమ్మవారికి పొంగళ్ళు పెట్టే కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం నాడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నిర్మల్, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఫిర్యాదుతో కదలిన ప్రభుత్వ యంత్రాంగం

**కుప్పం, మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ సుమిట్ కుమార్ కు ఎమ్మార్పీఎస్ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం మల్లానూరు పంచాయతీలో ప్రభుత్వం యంత్రాంగం తరలి వచ్చి సర్వే నిర్వహించారు. వివరాల్లోకెళితే పొన్నంగూర్ గ్రామంలో గోడిగడ్డల చెరువును ఆక్రమించుకొన్నారని హెచ్.ఎం మురుగేష్ మీద ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లా కలెక్టర్ కి పిర్యాదు చేశారు. చట్టానికి విరుద్ధంగా నీళ్లు ట్యాంకు పక్కన ఎలాంటి కట్టడాలు నిర్మించరాదని ఉన్న.. అధికారం ఉందని చట్టానికి తూట్లు పొడిచిన మురుగేష్ మీద ప్రభుత్వ యంత్రాంగం నిఘాతో పరిశీలిస్తున్నరని,చెరువు ఇంక్రోచ్మెంట్ జరిగిందని తేలడంతో త్వరలోనే జిల్లా కలెక్టర్ కి నివేదిక ఇస్తామని కుప్పం తాసిల్దార్ వివరించారని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విఆర్వో హంసగిరి,సర్వేయర్ వెంకటేష్, పంచాయతీ సెక్రెటరీ రమ్య, లక్ష్మి ,ఎమ్మార్పీఎస్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఎంపీ.ప్రకాష్ మాదిగ, క్లస్టర్ ఇంచార్జ్ దాము, టిడిపి పార్టీ ఇంచార్జ్ రమేష్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ రాజ్ కుమార్, కలైస్ సెల్వం,అన్నాదొరై, 234 బూత్ ఇంచార్జ్ నాగు ,గణేష్, రాజ్ కుమార్ ,సుభాష్, కదిరి ,వేలు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బోయకొండలో రాహుకాల అభిషేకం



**చౌడేపల్లి, మేజర్ న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానంలో శుక్రవారం లోక సుభిక్షం కోరుతూ రాహుకాల అభిషేకాన్ని సాంప్రదాయపద్ధంగా నిర్వహించారు. ఉదయాన్నే ప్రధాన అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకము అలంకరణ గావించారు అనంతరం రాహుకాల సమయంలో దంపతుల సమక్షం నందు రాహుకాల అభిషేకాన్ని నిర్వహించారు. పాత కళ్యాణ కట్ట వద్ద భక్తులకు శుక్రవారం ఉచిత అన్న ప్రసాద శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో ఈవో ఏకాంబరం, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** మారుతున్న కాలానికి అనుగుణంగా కలుషితో ఆహారం తీసుకోవడం వల్ల అనారోగ్యం పాలవుతున్నారని, శ్రేష్టమైన చిరుధాన్య ఉత్పత్తులను తినడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని టాటా ట్రస్ట్ వీఆర్వో హేమంత్ తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం సంకల్పంతో రాష్ట్రీయ సేవా సమితి మహిళ పొదుపు సంఘాల ఆధ్వర్యంలో టాటా ట్రస్టు సహకారంతో ఆటోనగర్ క్లస్టర్ రాస్ కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టాటా ట్రస్టు పిఆర్ఓ హేమంత్ విచ్చేసి మాట్లాడారు. ప్రస్తుత కాలంలో కలుషితమైన ఆహారం తీసుకుని అనారోగ్యాల బారిన పడాల్సిన దుస్థితి ఏర్పడుతున్నదన్నారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు చిరుధాన్యాలు తినడం ద్వారా మనలో శారీరక ఎదుగుదల దీర్ఘకాలిక వ్యాధుల నుండి ఉపశమనం పొందేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని, మారుతున్న కాలానికి అనుగుణంగా గోబీ, చికెన్ ఫ్రైడ్ రైస్ బిర్యానీ వంటి మసాలా ఆహార పదార్థాలను తినడం అనారోగ్యానికి దారితీస్తాయన్నారు. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, అరికలు వంటివి తినడం ద్వారా అనారోగ్యానికి శ్రేష్టకరమన్నారు. చిన్న వయస్సు నుంచే పిల్లలకు వీటిని అలవాటు చేస్తే పిల్లలు ఎదుగుదలకు దోహదపడమే కాకుండా భవిష్యత్తులో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా పెరిగి క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల నుండి బయటపడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆరోగ్యంగా జీవించడానికి రాస్-టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. రాస్ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ కోవిడ్-19



నేర్పిన పాఠాల నుండి ప్రజల జీవన విధానాన్ని ఆరోగ్య విధానంలో తగు జాగ్రత్తలు తీసుకుని వ్యాధి నిరోధక శక్తినిచ్చే సమతుల్య ఆహారం తీసుకోవాలని తెలిపారు. సాధారణంగా మానవ శరీరంలో బరువు తగ్గడం క్రమంగా జ్వరం రావడం తలనొప్పి రావడం మూత్రనాళాల్లో రక్తం రావడం నిత్యం నీరసంగా ఉండడం తదితర కారణాలు ఉంటే వ్యాధి నిర్ధారణ వైద్యుని సలహాల ద్వారా చేయించి వైద్య బృందం ఇచ్చే సలహాలను అదృష్టంగా భావించి ఆరోగ్యమే మహాభాగ్యంగా కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యుల ద్వారా 150 మందికి బిపి, షుగర్, హెపటైటిస్ బి పరీక్షలు ఉచితంగా చేసి సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో రాస్ సిబ్బంది సత్యనారాయణ, ఈశ్వరమ్మ, క్లస్టర్ లీడర్లు మంజుల, వాణి, జ్యోతి పాల్గొన్నారు.

# వైభవంగా అర్జునుడి తపస్సు

**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** కార్వేటినగరం మేజర్ పంచాయతీలో వెలసిన ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో తిరుణాల సందర్భంగా శుక్రవారం ఉదయం ఆలయంలో స్వామి అమ్మవారికు



అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంది వాహనంపై శివపార్తులు ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు కర్పూర హారతి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు మధ్యాహ్నం అర్జునుని తపస్సు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం అర్జున వేషధారణ తపస్సు మాను ఎక్కి విబుద్ధి పండు విసిరేసి ఘట్టం ఆకట్టుకుంది నిమ్మ పండు కోసం సంతానం లేని మహిళలు వరపడ్డారు. ఆలయం వద్ద రెడ్డమ్మ భాగవతాధారిని చవట గుంట వారిచే హరికథ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ద్రౌపతి అర్జునుడు కృష్ణుడు ఉత్తర గోగ్రహణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు, రాత్రి ఉత్సవం, అలుగు, ఉభయ దాతలుగా దేవస్థానం గాజుల కండ్రిగ గ్రామస్తులు, దేవస్థానం, పల్లి రెడ్డి కులస్తులు, నీలం కుమారు స్వామి వారు వ్యవహరించారు. రాత్రి శ్రీ వెంకటేశ్వర నాటక కళామండలి కిరణ్ కుమార్చే మహాభారత నాటకం నాటకం నిర్వహించారు. ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తోకల సోమనాథ్, కార్యదర్శి హరిబాబు, శివ ప్రకాష్ మొదలియార్, బాబు రెడ్డి కృష్ణయ్య భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా కేబిజి జన్మదిన వేడుకలు

**- ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప**

**వరదయ్యపాలెం,మేజర్ న్యూస్:** వరదయ్యపాలెం కేబిజీ కళ్యాణ మండపం అధినేత, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు,ఆంధ్రశ్రీ అవార్డు గ్రహీత కె.బి గురుదేవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప హాజరయ్యారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు పంచిపెట్టారు. మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, పుర ప్రముఖులు, కేబి గురుదేవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేకు కట్ చేసి, మిత్రులకు గుర్తుగా కేబి గురుదేవ్ కు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయాలకతీతంగా నాయకులు పాల్గొన్నారు.



## శ్రీవారి అభిషేక సేవలో పలువురు ప్రముఖులు



**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనార్థం గురువారం తిరుమలకు చేరుకొని శుక్రవారం ఉదయం మాజీ రాజ్యసభ సభ్యుడు టి సుబ్బిరామి రెడ్డి., రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణలు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో శ్రీవారి అభిషేక సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీ వారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.

**రేపు తిరుమలలో పౌర్ణమి గరుడసేవ**

గురు పౌర్ణమి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 21న ఆదివారం గరుడసేవ జరుగనుంది. ప్రతినెలా పౌర్ణమి పర్వదినాన టీటీడీ గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా రాత్రి 7 నుండి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై తిరుమాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షిస్తారు.